
UNIVERSAL
LIBRARY
OU_204140
UNIVERSAL
LIBRARY

# కొత్త పూతలు:

నిడుదవోలు

లింగమూర్తి



మిత్ర మండ

తము

మొదటి కూర్పు

= ప్రకాశకులు =

నిడుదవోలు లింగమూర్తి

గాంధిపార్కు బరంపురం

[ గంజాం జిల్లా ]

అర
అణాలు

చెన్నపురి :
ప్రజామిత్ర ముద్రాశాల

నన్ను కని, పెంచి,
పెద్దవానిజేసిన
మా
అమ్మకు
నాన్నకు

# తొలి పలుకు

నేను యీ వ్యాసాలు ఆంధ్రలోకానికి అందజేయగలిగేనంటే అందుకు ప్రథమ తాంబూలం 'ప్రజామిత్ర' వారిది. తరువాత కారకుడు నా ప్రియమిత్రుడు, సోదరతుల్యుడు, నివురు కప్పిన నిప్పులాటి నియోగిబిడ్డ, పాడూరు వెంకట కృష్ణారావు. నా మిత్రుని ప్రోద్బలం, 'ప్రజామిత్ర' ప్రోత్సాహం లేకపోతే నా వ్యాసాలు ఏమూల నుండేవో.

రామాయణం, భారతం, ఈ రెండు పవిత్ర గ్రంథాల సారాంశం ప్రతి హిందువుడు ఏదో ఒక వయస్సున, ఏదో ఒక సందర్భంలో తెలుసుకునే ఉంటారు. అయితే యీ రెండు గ్రంథాలు ఆమూలాగ్రంగా చదివిన వారు అరుదని నా అభిప్రాయం. నేను కూడా చదవని వారిలోనే లెక్క.

పాలు తియ్యగా ఉంటాయని వాటిని చల్లచుక్క వేసి పులియబెట్టి మథించకపోతే నవనీతం రాదు. ఆ విధంగానే ఏదైనా ఒక క్రొత్త త్రోవ ఒక లేఖకుడు త్రొక్కితే అందులో నిజానిజం తెలిసికోవాలన్న పరిశీలనా దృష్టి కలిగించి ఆ గ్రంథాలు చదవడానికి ఉత్సాహం కలిగిద్దామని, అవి చదివి వాటి నీతిని గ్రహించేటట్టు చేదామని యీవ్యాసాలు వ్రాసేటందుకు కారణం.

అందుకుగాను ప్రస్తుత యువకహృదయంలో కొన్ని వివాదాంశాల గురించి కలిగే సందేహాలు నేను కథావస్తువులుగా ఎన్నుకొన్నాను. అంతే గాని ఆ పవిత్ర గ్రంథాలమీద అసూయను కల్పించడం గాని, పురాణ పురుషులకు కళంకం తేవడం కాని నా ఉద్దేశం కాదు. నేను చనువుకొన్నది తక్కువని నాకు తెలుసు. అయినా సాహసించి వ్రాసేను.

ముందు వరుని చూచి తండ్రి కూతుర్ని కనలేదు. అట్లాగే ప్రజాభిప్రాయమును బట్టి వ్యాసకర్త వ్యాసాలు వ్రాయలేదు. ఆ బిడ్డ యిచ్చే ఆనందంగాని, దుఃఖం గాని ఆ వరుని భాగ్యం. ప్రజాసామాన్యంలా ఒకడీ క్రింద లెక్కబెట్టుకొని తన కూతుర్ని చూచి మురిసిపోయే తండ్రిలాగే ప్రతీ వ్యాసకర్తా వ్రాస్తాడు. పాఠకలోకం దాని బాగోగుల స్థనశల్య పరీక్ష చేయక ఆనందించవలసి ఉంటుంది.

ని॥ లింగమూర్తి,

వ్యాసకర్త.

# ౧. ఆరవనాటి రాత్రి కర్ణుడితో-

"అమ్మా! కోరి చేపట్టవలసినవాడు భేదించేడు మత్స్య యంత్రం. నువ్వు ఎంతో అదృష్టవంతురాలివి. పాండవ మధ్యముని భార్యవయేవు. తగినవరుడు దొరికేడు. సుఖములకు లోటుండదు. మీరు వెళ్ళవలసిన వేళయింది. అమ్మా! జాగ్రత్త!" అంటూ సాగనంపుతున్నాడు ద్రౌపదిని, ద్రుపద మహారాజు. కన్నీటిబొట్లు కప్పిపుచ్చడానికి ముఖము పక్కకు తిప్పేడు.

"తండ్రీ! మీ ఆశీర్వాదముంటే నాకు చాలు. మీరు కంట తడిపెట్టుకుంటే నాకు కాళ్ళాడకుండా ఉన్నాయి. వెళ్లి వస్తాను." అంటూ సెలవు పుచ్చుకొంది తండ్రిదగ్గర ద్రౌపది.

"నాయనా! ఎండవే డెరుగదు పిల్ల. జాగ్రత్తసుమా!" అంటూ అర్జునున కప్పగించింది ద్రౌపది తల్లి.

"మీ అమ్మాయి శ్రేయానికి లోటు రానిస్తానా?" అంటూ అభయ మిచ్చేడు అర్జునుడు.

♦ ♦ ♦

"అమ్మా! ఈ దినం ఒక అమూల్యమయిన ఫలం దొరికింది" అన్నాడు అర్జునుడు తల్లికి నమస్కరిస్తూ. "మీ అన్నదమ్ములు సమంగా పంచుకోండి" అంది ఆశీర్వదిస్తూ కుంతీదేవి.

నిశ్చేష్టులై నిలబడ్డారు పాండవు లంతా.

"అత్తా! నమస్కారము. నీ పుత్రునకు దొరికిన ఫలం నేను." అంటూ ద్రౌపది కుంతీదేవి కాళ్లమీద పడ్డది.

కుమారుని నోటంట కథంతా విన్నది కుంతి.

"తెలియక అన్నాను. కాని మాట తప్పడం పాండు పత్నికి చేతకాదు. మీ ఐదుగురూ ఆ ముద్దుగుమ్మ నేలుకోండి" అన్నది కుంతి. ఇంక మరి గత్యంతరం లేదనుకుంది ద్రుపద రాజపుత్రి.

◆ ◆ ◆

"పాండవాగ్రజునకు నమస్కారము!" అంది పాంచాలి మొదటినాడు రాత్రి పడకగదిలో.

దీర్ఘ సుమంగళీభవ! ద్రుపదరాజపుత్రీ! నీవు మా యింటికి లక్ష్మీదేవిలాగు ఉన్నావు. నీవు వచ్చిన శుభఘడియలలో మా రాజ్యలక్ష్మి కూడా మాకు వచ్చినట్లుంది. ఆనందానికి లోటుండ దనుకుంటాను."

"ధర్మనందనా! నాకొక శంక పుట్టినది. నివృత్తి చెయ్యడానికి తమకు తప్ప నాకింకొకరు కానరాలేదు. అడగమని సెలవా?"

"నీ కా అభ్యంతరం?"

"తనకన్న చిన్నవయస్కుడైన అన్నదమ్ముడు చేపట్టిన యిల్లాలిని పితృసమానుడైన పెద్దన్న స్వీకరించవచ్చునా? అని."

"ఇందుకు శాస్త్రిసమ్మతమైన వాక్యమున్నట్లు నాకు కనిపించలేదు. కాని మాతృవాక్య పాలన ముందు, శాస్త్రోల్లంఘన పాటింపతగ్గ తప్పు కాదు."

"ధర్మవిరుద్ధమైన ఏ కర్మయినా మాతృవాక్య మని

చేయువచ్చున్న మాట?"

"మాతృదేవతే మన ఆరాధనయందు ఆది దేవత. కాబట్టి ఎంతమాత్రము అభ్యంతర ముండదు. ఆ ధర్మాధర్మ విచక్షణ వారిదే కాని మనది కాదు."

"ఇందుకు లోకం వప్పుకుంటుందా?"

"తల్లికన్న లోకమున్నదా?"

"నా యీ విషయం జారత్వంకింద లెక్కింపబడదూ?"

"నువ్వు జారిణికింద కాదు. పరమభాగవత స్త్రీకింద లెక్కింపబడతావు."

"బహుపతీత్వం అనుభవించినందుకా?"

"పాంచాలీ! నువ్వు పొరబడుతున్నావు."

"మరి ఎందుకని మీా భావం?"

"ఒక్క మగవానిని చేబట్టి ఆనందంగా గృహస్థ ధర్మాలు పాటించడానికి వాతావరణం కల్పించ అసక్తులైన ఆడవారికన్న ఐదుగుర్ని మెప్పించి నువ్వు మెప్పొందగలిగితే శ్లాఘించవలసిన విషయం కాదూ?"

"ఆ విషయంలో నాకన్న వేశ్య చాలా ఉన్నతస్థానంలో ఉంటుంది."

"వేశ్యావృత్తి చేసే ప్రతి యింతికీ బ్రహ్మ యీ శక్తి యిస్తాడు."

"ఇదే ధర్మసూత్రంకింద లెక్కిస్తే యింక అడిగేదేమిటి? లోకంలో పాతివ్రత్యమే ఉండదన్నమాట. జారత్వమనే మాట అర్థంలేనిదవుతుంది......"

"పొరపాటు, పొరపాటు, నా అర్థం నీవు గ్రహించలేక పోయేవు......"

"గ్రహించడాని కేమున్నది. మాతృస్థానంలో మాలిన్యం చేరినా తప్పు లేదన్నారు. ఎంతమంది మగవారిని స్వీకరిస్తే అంత ఉన్నతస్థానం వస్తుందన్నారు."

"కాదు. నువ్వన్నది అన్యగోత్రీయులను స్వీకరించడం."

"సగోత్రీయు లెంతమంది ఐనా బాధలేదా?"

"మరి సంతానప్రాప్తికోసం నియోగింపబడి వెళుతూ ఉంటే అది జారత్వంకింద చూస్తున్నారా? లేదే. నువ్వు చేసింది యించుమించు అదే విధంగా ఉంటుంది."

"ఎంత మాటన్నారు! నాకు సంతానం లేకపోతే సరే కాని, సంతానమే కలిగిందంటే మీ ఐదుగురిలో అది ఎవరి బీజమని చెప్పుకునేది? ఈ నగుబాటు నాకు రాకుండా ఉంటేనే కాని నే నిచ్చట ఉండను. ఈ విషమ పరిస్థితులనుండి దాటడానికి నా కొక్కటే మార్గం కనిపిస్తున్నది. నేను మా పుట్టింటికి పోయి పునర్వివాహం చేసుకోవడమే."

"నీకు పితృవాక్యమునందు లక్ష్యము లేదన్నమాట."

"మానాభిమానాలు వదులుకోమనలేదు మా తండ్రి. మీ మాట వింటే మానానికీ మర్యాదకీ తిలోదకాలు యివ్వాలన్నమాట."

"మరి నే చెప్పవలసింది లేదు రాకుమారీ."

"అడగ మరిచేను. మీ రింకా అవివాహితులుగానున్నారే? ఎందుకు పెండ్లాడలేదు?"

"నాకు ఎవరు పిల్లనిస్తారు పాంచాలీ - నా కంతగా ధనము లేదు. మొదలు ధనాకాంక్షా లేదు. తరువాత ఈ కౌరవుల ఒత్తిడివల్ల మావి మా కుండడమే కష్టంగా ఉంటున్నది. పోనీ, బాణం ఎక్కుపెట్టి పోరు సలుపుదామంటే అహింస! తలుచుకుంటే గుండె చెరువైపోతుంది. ఇంక చదువా - నాకన్న చదువుకున్నవాళ్లు ఎక్కువమందే ఉన్నారు. ఇంతకూ క్షత్రియ కులంలో చదువు లెక్క చూచేదెవ్వగు? ఏదో అన్నదమ్ములు నలుగురూ నా మాట వినబట్టి కానీ, లేకపోతే నే నొక లెక్కలోవాడినా? ఇలాంటి దౌర్భాగ్యుడికి వివాహ మయే దేలాగు?"

"మీ ధర్మశాస్త్రి మేలాగున్నా యిప్పుడు ఇంకొక్క అనుమాన ముంది, మీ రాగ్రహించకండి."

"ఆగ్రహామునకు మాత్రము ఆశ్రయ మియ్య లేదు."

"మీరు ఏ దేవకర్మ ఆచరించవలసివచ్చినా నన్నండగా ఉంచుకుంటారా?"

"లేకపోతే దాంపత్య మేమిటి?"

"అప్పుడు మీకు ధర్మపత్ని నేనా?

"అందుకు వశిష్టు లున్నారులే."

"మిమ్మల్ని యింతసేపూ ప్రశ్నించి ఆయాసపెట్టేను."

"ఆ శ్రమ నాకు నీ మీది అనురాగాన్ని హెచ్చు చేసింది."

"నిజమేనా?"

"నా హృదయం పరిశీలించగలిగితే చూడు."

"శుభమస్తు! మత్తేభకుంభ స్తనీ. నీ ముఖం చూస్తే ఆనంద ముట్టిపడుతున్నది. ఎప్పు డెప్పుడా అని ఆశించిన రాత్రి యిప్పటికి వచ్చినది..."

"చాలు ఈ శుష్క ప్రియోక్తులు."

"ఓహో! ఏమిటి నా దురదృష్టము కాబోలు. కోపము వచ్చినట్లున్నదే. తెలియజెపితే పొరపాటైతే సవరణ చేసు కుంటాను. లేకపోతే క్షమాభిక్ష వేడుకుంటాను."

"పాపం. ఏమీ తెలియనట్లున్నదే. పౌరుషము లేని మగవానితో మాట్లాడి ఎందుకూ?"

"ఆఁ-ద్రౌపదీ! ఏమిటన్నావు? ఏమిటా పౌరుషహీన మైన పని నేను చేసినది?"

"ఇంకేమి కావాలి. మేటి విలుకా డనిపించుకొని మత్స్యయంత్రము భేదించి కోరి తెచ్చుకున్న భార్యను అన్న దమ్ముల కప్పగించి చేతగాక ఊరుకున్నకంటే పౌరుష హానేమి ఉన్నది?"

"పాంచాలీ, నీవు చెప్పినది నిజమే. నీకు ఇది యిప్పుడే తోచిందా? లేక మా పెద్దన్నగార్ని కూడా ప్రశ్నించేవా?"

"అడిగేను. ఏవేవో నీతులు చెప్పి సమర్థించేరు. సమ ర్థించరూ మరి. అనాఘ్రాత కుసుమం ఎదురుగుండా ఉంటే ఆఘ్రాణించడానికి ఎన్నైనా చెప్పవచ్చును."

"ఎంత మాటన్నావు. మా అన్నగారి హృదయం కని పెట్టలేకపోయే వన్నమాట. ఆయన సమర్థించేరంటే అందులో ధర్మ మున్నదన్న మాట."

"చేసిన తప్పు చేతకానప్పుడు సమర్థిస్తారు. నన్ను మీరంతా సమంగా పంచుకుంటున్నారే. మరి వారుకూడా యిలాగ పెండ్లాడి పంచిపెడితే బాగుండేది."

"మరి మా అమ్మమాట చెల్లించవద్దూ?"

"నే నెందు కనాలి. స్త్రీకి కామాతురణ మెందని నీకు తెలియదో? లోకంకొరకు మాతృస్థానం నిర్మాలిన్యంగా ఉంచడానికి, లోకంలో అల్లకల్లోలం లేకుండా ఉండడానికి, పతివ్రతా నియమా లున్నాయి కాని, కట్టుకున్న పతి జారత్వాని కొప్పుకుంటే అంతకన్నా కావలసిన విషయ మేముంటుంది ?"

"అబ్బా, నువ్వు నన్ను దహించేస్తున్నావు."

"పోనీయండి. ఇబ్బంది అయితే మానేస్తాను."

"మా తల్లిమాట, మా అన్నగారి సమర్థింపు ఉంటే ప్రాణహానేనా చేస్తాను. ఇంతసేపు చేసిన వితండవాదంతో పిపాస ఎక్కువయింది. నీ అధరసుధారసమిస్తే తీరుతుందేమో."

"అది ఉచ్ఛిష్టం."

"పోనీ. ఇటురా."

"నా కన్యాత్వం చెడింది."

"ఎంతటి కఠిన హృదయం ప్రేయసీ, నీది. నీ స్పర్శ కోరుతూఉన్న ఈ ప్రతీ అవయవానికీ కొంత విశ్రాంతి కలిపించవూ! ఎంతేనా, నిన్ను నలుగురిలో గెలుచుకున్నాను కానా?"

"నన్ను మీ యిచ్చవచ్చిన రీతి మీరు ఉపయోగించుకోవచ్చు. కాని ఒక్క అనుమాన మున్నది."

"ఏమి టది ?"

"మీ తల్లి మీ అన్నదమ్ము లందరితో నన్ను సమంగా ఏలుకోమన్నది కదా."

"ఔను."

"ఇవాళ ప్రొద్దుట కర్ణుడు ప్రాయోపవేశం చేసుకుంటానన్నాడట దుర్యోధనునితో. మీరు విన్నారా ?"

"వినలేదు. కాని ఆ మాట మన కెందుకు ?"

"అందుకు కారణము నేనేనట."

"అదెలాగు?"

"తాను మత్స్యయంత్రం భేదించి నను చేపట్టలేకపోయేనుకదా అంటున్నాడట."

"చేతగానితనానికి పొరుమపడ్డ మెందుకు ?"

"పోనీ. మీతో వంతుకు పెడితే."

"ఛా. అదెంతమాత్రం పనికిరాదు. ఇప్పటికైనదే చాలు."

"మీ తల్లి కోరికకూ మీ అన్నగారి ధర్మానికీ ఎంతమాత్రం లోటు రాదే. అదీకాక ప్రాణదానం చేసినవారౌతారు.

"దీనినిబట్టి చూడగా నీకు కర్ణునిపై యిష్టమున్నట్లుంది."

"నే నిందాకా చెప్పిందే అది."

"మా పెద్దన్నగార్ని అడిగి నీయిష్టమువచ్చిన రీతిని చెయ్యి. కాని నకుల సహదేవులతో ఈ విధంగా వాదించేవంటే భయపడతారుసుమా."

"నా కథంతా తెలును."
"వేగుచుక్క రానున్నది."
"అలాగునా."

♦ ♦ ♦

"అత్తా, నే నీ దినం కర్ణునివద్దకు పోవాలా?"
"అక్కరలేదమ్మా."
"యుధిష్టిరా! నేను కర్ణునివద్దకు పోతే తప్పా."
"లేదని నా అభిప్రాయం."
"సరి, నా కవసరమయినప్పుడే పోతాను."

---

## ౨. నపుంసకునివద్ద నాట్యవిద్యాభ్యాసం

"మహాప్రభూ! నపుంసకు డొకడు దేవరవారి దర్శనమునకొఱకు ద్వారమువద్ద వేచియున్నాడు" అన్నాడు సేవకు డొకడు దర్బారులో నున్న విరటరాజుతో.

"లోనికి రానీ" అని అనుజ్ఞ యిచ్చాడు విరటరాజు.
"పేరు?"
"బృహన్నల అంటారు"
"ఊరు?"
"యాచకుల కొక వూరేమిటి, మహాప్రభూ!"
"మా దర్బారులోకి రావడమునకు కారణం?"

"పొట్టకూటికి"

"దాసీపని చేస్తావా ?"

"చిత్తం. నాకు నాట్యంలో నేర్పు ఉన్నది."

"నాట్యమా ?"

"శ్రీవారు చిత్తగిస్తే నా చాతుర్యం చూపిస్తాను"

"ఏదీ ?"

♦ ♦ ♦

"భళీ ! నీ నృత్యం అత్యద్భుతముగా వున్నది. నపుంసకులలో ఇంత చతురత ఉన్నవారిని ఇంతవరకు చూడలేదు" అన్నాడు విరటుడు.

"తమరు అభిమాన దృష్టితో చూచారు" అన్నాడు బృహన్నల.

"తండ్రీ ! నేను ఇతనివద్ద నృత్యము నేర్చుకోనా ?" అంది ఉత్తర—రహస్యముగా తండ్రితో.

"మా ఉత్తరకుమారికి నాట్యము నేర్పుతావా ?"

"ఏలినవారి ఆజ్ఞకు అభ్యంతరమా "?

♦ ♦ ♦

"ఆహా ! ఏమనుకుంటే యేం లాభం ? నా తలిదండ్రులను, మా వంశమర్యాదను, మా కులసంప్రదాయమును తలుచుకుంటె గుండె నీరైపోతుంది. నా మగతనము మరుగు పరిచి, నా వీరత్వము వీధిలో విడిచి, ఆడజాతికి మగజాతికి కూడా చెందనివారిలో లెక్కింపబడుతూ ఆడదానికి నాట్యం నేర్పవలసిన వృత్తి యేర్పడింది. రణరంగంలో బాణ మెక్కుపెట్టి వందలకొలది వైరివీరులను కూలదీయవలసిన ఈ చేతులు

"దాదివద్దరకు వెళ్లు తల్లీ!"

"నువ్వు సర్దితేనే నాట్యాని కనుకూలంగా ఉంటుంది."

"అబ్బే, దాది సర్దితేనే బాగుంటుంది."

"అలా కాదు. నువ్వే సర్దాలి."

◆ ◆ ◆

"ఈ బృహన్నల తీరులో కొంత రహస్య మున్నట్లుంది. నా చెంత రావడానికి జంకు, నన్ను తాకడానికి బిడియం, ఈ రెండిటికీ కారణం తెలియకుండా ఉంది. దీని అంతు చూడాలి. అదీగాక బృహన్నలలో నాకు క్రొత్త ఉత్సాహము కలిగించ గల శక్తి ఉన్నది. ఇదివరకు మా దర్బారులో నాట్యంచేసిన ఏ నర్తకీ నర్తకులలోనూ యింత మాధుర్యం కనిపించలేదు. బృహన్నల ముఖవర్చస్సు నాకు ఆనందాన్ని యిస్తానన్నట్టుగా సూచిస్తూ ఉన్నది. కాని దేనికీ కారణం గోచరించకుండా ఉన్నది."

◆ ◆ ◆

"చూడు ఉత్తరకుమారీ! ఇలా వెనక్కు వెనక్కు వంగాలి. ఊపిరి బిగబట్టాలి. తరువాత చేతు లీ విధంగా ఉండాలి."

"అబ్బా, నాకు వద్దు బృహన్నలా! నేను పడిపోతానేమోనని భయం వేస్తున్నది."

"ఇది చాలా చక్కటి భంగిమం. ఇది నేర్చుకోకపోతే యిన్నాళ్లూ నేర్చుకొన్నది వ్యర్థం."

"నే పడితే చూడాలని ఉంది కాబోలు?"

"భయం లేదు. పడకుండా పట్టుకుంటానులే."

"పట్టుకో మరి...నీ చేతులు తగిలితే ఒక వింతగా ఉంది."

"ఏం చేతనో ?"

"నాకు తెలియదు. కాని ఆ నాట్యముకన్నా నీ చేతుల్లో అలాగు ఉందా మనిపిస్తున్నది."

"పిచ్చి తల్లీ."

"నువ్వు నడుమ్మీద, వక్షస్థలంమీద అలా చెయ్యివేసి ఉంచు. నాట్యం తరువాత నేర్చుకుంటాను."

"నీకోర్కె వెఱ్ఱిగా ఉంది తల్లీ."

"నేను నీకు శిష్యురాలను కదా. తల్లీ అంటావేమీ ?"

"రారాజు కూతురువు."

"విద్యలో సంఘుభేదం లెక్కిస్తారా ?"

"వాద నెందుకు కుమారీ ? పోనీ. కుమారీ అని పిలవనా ?"

"వద్దు. 'ఉత్తరా' అని పిలు."

♦ ♦ ♦

"ఈ ఉత్తర విషయం చూడగా చూడగా విషమించేటట్టుంది. ఈ పరిస్థితులలోనుంచి తప్పుకునేటట్టు చేయాలి. పరనారీస్పర్శ నాకు కష్టంగానే ఉంది. దగ్గరనున్న ద్రౌపదినే యేలుకోలేని స్థితి నాది. ఉత్తర నాదగ్గరకు వచ్చినప్పుడల్లా ఒడలు దాచుకోడానికి వీలులేక అసమానసౌందర్యం వెదజల్లుతున్నది. ఇంద్రుని ఆహ్వానముమీద స్వర్గలోకము వెళ్లి ఊర్వసి ప్రేమభిక్ష వేడినప్పుడు నిగ్రహించుకొచ్చాను. కాని

ఇప్పుడు మన స్నేహకట్టడానికి చాలా ప్రయత్నం కావలసి వస్తున్నది. నా అన్నదమ్ములు, భార్యకూడా ఈ నా ఏకాంత వాసం చూసి నన్ననుమానిస్తున్నారేమో కూడా. కానీ, అన్నింటికి ఆ భగవంతుడే ఉన్నాడు."

♦ ♦ ♦

"ఈదినము నాకు నాగబంధము నేర్పు బృహన్నలా."

"ఆలాగే. నవనాళ్లు వంచి చెయ్యాలి ఆ నృత్యం."

"నువ్వు నాకు అండగా ఉంటావు కదూ."

"ఐనా కొంత కష్టమే."

"నీ చేతులతో నువ్వు పట్టుకుంటే సాధ్యము కాని నాట్యం లేదు."

"నన్నట్టినే పొగడుతున్నావనుకుంటాను."

"లేదు బృహన్నలా! నువ్వు నపుంసకుడవైనా సర్వవేళలా నీ ముఖం చూడాలనీ, నీతో ఆడుతూ పాడుతూ ఉండాలనీ, నువ్వు నన్ను పట్టుకొని త్రిప్పుతూ ఉంటే అందులో ఉన్న సుఖం అనుభవిద్దామనీ ఉంటుంది. మా తండ్రి నడిగి నీవద్ద నాట్యం నేర్చుకోవడమేకాక నా సొంత పరిచారికకింద నియమించుకొని నామందిరంలో ఉంచుకోవాలని ఉంది.నిజం."

"నామీద చాలా అభిమాన మున్నదన్నమాట."

"నాకొక చిన్న ఊహ పుట్టింది, బృహన్నలా!"

"ఏమిటది!"

"నిన్ను ఒక వీరాధివీరుని వేషం వేయించి నా తండ్రికి చూపిద్దామని."

„నన్నా! నలుగురూ నవ్వరూ."

„పోనీ. నేను చూద్దామని."

„ఇంకా కొన్ని దినాలు పోనీ"

„నీ గొంతుకలో గానములో వుండవలసిన మాధుర్యముకన్న వీరునిలో వుండవలసిన ధాటీ ఎక్కువగా ఉంది."

„అది నేను తెలిసికొనలేను."

„నీ నేత్రంలో సేనాధిపత్యం ఉట్టిపడుతున్నది."

„ఔను కాబోలు."

„నీ శరీరము వీరుని శరీరమని చెప్పకనే చెప్పుతున్నది."

„కాని నేను నపుంసకుడనే."

„నేను నమ్మలేకున్నాను."

„పౌరుషమున్న మగవాడెవడేనా నపుంసకుడ నంటాడా? ఆడవానికి నాట్యం నేర్పుతాడా?"

"ఏదేనా కారణముండవచ్చు"

"వాదనలలో కాలయాపన చేస్తున్నామనుకుంటాను. నాట్యానికి వేళయింది."

"నా దగ్గర ఏదో రహస్యం కప్పిపుచ్చుతున్నావు."

"కాలం వృథా వ్యయపరిస్తే మీ తండ్రిగారు కోపగిస్తారు."

"నీ రహస్యం చెప్పితీరాలి. లేకపోతే నేను నాట్యం నేర్చుకోను. మా తండ్రితో చెప్పి..."

„ఈ మొండితన మేమిటి ఉత్తరా."

„మొదట మొండితనం నీది."

,,నాకు కొన్ని దినాలు గడువియ్యి. నీ కోర్కె నెర వేరుస్తాను.''

,,నువ్వు రేపు పురుష వేషం వేసుకొని రావాలి.''

,,సరే.''

◆ ◆ ◆

,,నువ్వు నపుంసకుడ వని యిన్నాళ్లూ అబద్ధమాడు తున్నావా లేదా. పుంస్త్వము లేని వారికి వేషము తగుతుం దంటే నే నమ్ముతానా? నువ్వెవ్వడవో రాజపుత్రుడవయి ఉండాలి. ఏదో కారణాంతరమువల్ల వేషము వేసి నాకీ నాట్యం నేర్పుతూ ఉండాలి. నిజం నాదగ్గర దాచిపుచ్చుతున్నావు. నిన్ని పురుష వేషములో చూచినవా అందరికీ నీ ముఖవర్చస్సు నీ పూర్వ స్థితిని వర్ణించి చెప్పుతున్నది. నువ్వు నన్నింత మోసగించవద్దు. రహస్యం విప్పి చెప్పాలి.''

,,నీ ఊహ నిజమే.''

,,నువ్వెవరివో చెప్పు. తగిన కారణముంటే నీ రహస్యం దాచుతాను. లేకపోతే మా తండ్రితో చెప్పవలసివస్తుంది. నీ వింత సిగ్గుమాలి ఆడవారిలో అప్పవై కూర్చున్నా. క్షత్రియ కుల రాణివాసంలో పరాయి మగవానిని ఉంచడం ఎంత నగుబాటు. మా వంశాని కంతటికీ కళంక మన్నమాట.''

,,నేను ప్రతిజ్ఞలచేత కట్టుబడి ఉన్నాను.''

,,మోసము చేసి రాణివాసములో ప్రవేశించమని ప్రతిజ్ఞలు బోధించినవి కాబోలు.''

,,అదే ప్రతిజ్ఞ. దానినే అజ్ఞాతవాస మంటారు.''

,,మోసము చేయుటకు ప్రతిజ్ఞా: అజ్ఞాతవాసము పాండుపుత్రులకు గాక. ఆ. అం అదే మరి. జ్ఞాపకము వచ్చింది. ఈ మధ్య పాండవ మధ్యముని చిత్రము చూచాను. ఆ పోలికలు నీతో సరిపోలుతున్నవి. నిశ్చయం. నిశ్చయం. నీవు అర్జునుడవే. సందేహం లేదు. అర్జునా! ఇక నీ వేషము చాలించు. నా మనస్సు స్థిమితం తప్పినది.

◆ ◆ ◆

,,ఉత్తరా! ఉత్తరా!,,

,,దగ్గరకు రాకు అర్జునా!,,

,,ఉత్తరా! ఇంకొక పక్షమజ్ఞాతవాస మున్నది. నన్ను కాపాడవూ?......ఈ రహస్యము ఈ రెండు వారాలు కప్పిపెడితే నీవు చేసే గురుశుశ్రూషకు తగిన ఫలం అనుకుంటాను. గురుభిక్ష యిచ్చిన ట్టవుతుంది."

"నీ చిత్రము చూచినప్పు డెన్నెన్నోమారు లనుకున్నాను అర్జునా, నిన్ను వివాహ మాడుదా మని. అందు కొప్పుకోవూ?,,

"నువ్వు వయసుచేత, విద్యచేత కూతురితో సమానురాలివి. ఎలా వివాహ మాడేది? నాకు అభిమన్యుడనే కొడుకున్నాడు. వానిని పెండ్లాడి నా చెంత నుందువుగాని."

"సరి. నీ రహస్యాని కభ్యంతరం లేదు. నీ నపుంసకవేషాని కంతకన్నా. ఇంక నేను వెళుతాను. నాట్యాని కింక నీదగ్గరకు రానులే.,,

◆ ◆ ◆

"మహాప్రభూ! కౌరవులు గోగ్రహణము చేసుకొని

పోతున్నారు.'' అని మనవి చేసేడు సేవకుడు విరటరాజుతో.

"తండ్రీ! నేను వెళ్లి ఆవుతాను" అన్నాడు ఉత్తర కుమారుడు.

"బృహన్నలకు అశ్వహృదయం తెలుసు, అన్నకు సారథిగా పంపు తండ్రీ!'' అంది ఉత్తర.

"ఛీ. నపుంసకుణ్ణా?" అన్నాడు విరటుడు.

"నా కొద్దు.'' అన్నాడు ఉత్తరకుమారుడు.

"పంపు తండ్రీ. తరవాత తెలుస్తుంది" అంది ఉత్తర.

♦ ♦ ♦

"తండ్రీ, బృహన్నల నపుంసకుడు కాడు. అర్జునుడు" అన్నాడు విజయసూచకమైన మందహాసంతో ఉత్తర కుమారుడు.

"పాండవులేవురూ ద్రుపద రాజపుత్రీ, అజ్ఞాతవాసము మన ప్రాసాదమందే గడిపివున్నారు." అని అంది ఉత్తర సగర్వంగా.

"భాగ్యమంటే నాదే." అన్నాడు విరటుడు.

---

# 3. సీతా రాములకు మళ్లీ వనవాసము

అయోధ్య ప్రవేశించు ముందు ఘడియలలో, లక్ష్మణునితో శ్రీరాముడు—

"లక్ష్మణా! నీ సహాయం లేకపోతే నా యీ వనవాసం ఎంతో కష్టతరమౌను సుమా! నీవు చేసిన సేవ వర్ణనా

తీరినమైనది. నీ త్యాగం శ్లాఘనీయమైనది. మనం అయోధ్య దగ్గరకు వస్తున్నాం. తిరిగి వస్తామో లేదో అనుకున్నాను. అదిగో అయోధ్యాపుర నివాసులు మనల్ని ఎదుర్కొనేందుకే వస్తూన్నట్లుంది.

"ఇంక మన స్వేచ్ఛ శృంఖలాబద్ధమైనది. గత కాలం లో నాకు చేసిన సహాయముకన్న యిప్పటినుంచి నువ్వు ఎక్కువ సహాయం చేయవలసి వుంటుంది. రాజ్యం ప్రజాస్వామికము. ప్రజల శ్రేయస్సే రాజు శ్రేయస్సు. కాబట్టి బహుప్రమత్తుడవై లోపాలు కనిపెట్టి తెలియచేస్తూ ఉండాలి, లక్ష్మణా."

లక్ష్మణుడు-[ఉత్సాహపూర్వకంగా]:—"మిమ్మలను రాజుగ, దైవముగ భావించి మీకు మారు మీ పాదుకలను నిల్పి నిష్పాక్షికముగ వేనోళ్ళ మన్ననల పొందుతూ రాజ్య తంత్ర ప్రవీణుడని లెక్కింపబడుతూ ఉన్న భరతుడు మీకు చేదోడు వాదోడుగ నుండ, పితృతుల్యుడు రాజ్యశాస్త్రవేత్త అయిన సుమంత్రుడు మీకు మంత్రియైయుండ, లోపాలొస్తాయన్న భయం మీ కెందు కన్నయ్యా."

శ్రీరాముడు:—కాదు లక్ష్మణా, వారికి నాయందు—ఈ యెడబాటువల్ల—నీ కుండే చనువు వుండకపోవచ్చు. అదీ గాక, భక్తిచేతను భయముచేతను నాతో నిర్మొగమాటముగ చెప్పలేక పోవచ్చును. అందుచేత రాజ్యంలో అరాచకము ప్రబలవచ్చు. అందుకోసమని నీ కింతగా చెప్పవలసివచ్చింది.

సీత - [మందహాసంతో]:—ప్రియా! మొన్న మొన్న మీ వియోగముచేత కలిగిన వేదన యింకా చల్లారనే లేదు.

మీరు మీ రాజ్యపాలనమందు మునిగి, నన్ను మరుస్తారేమో అని...

"జానకీ! రాజు ప్రజాపరిపాలకుడు, ప్రజా సేవకుడు."

"కాని మీపై నాకు సగ మధికార ముంది, తెలుసునా!"

"రాజ్యపాలనమందు కళంక మొస్తే ఆ నగుబాటునందు కూడా సగపాలు నీదే సుమా!"

"ఎంతటి మాటకారులు!"

"రా-జ-నీ-తి."

◆ ◆ ◆

[అరణ్యవాసానంతరమున అయోధ్య చేరిననాడు, రాత్రి పడక గదిలో ఊర్మిళతో]

లక్ష్మణుడు:—ఈ రాత్రి ఒక పర్వదినంలా వున్నది ఊర్మిళా.

ఊర్మిళ:—మానవులు ప్రకృతి చేతుల్లో కీలుబొమ్మలు.

"ఔను ప్రేయసీ. ఇన్నాళ్లు నేను వనవాసంలో గడపిన రోజులు స్వప్నప్రాయంగా ఉన్నాయి.

"ఉపవాసానంతరమున భోజనము రుచిగా వుంటుందిగా, మరి."

"నీ వదనం చూస్తేనే చాలు ఆనందానికి."

"పాపం! కూరలు తిని, నారలు కట్టి ఎన్నెన్ని..."

"ఆ వాతావరణం నా కొక విధంగా ఉపకారమే చేసిందనుకో. లేకపోతే ఏదో కోర్కె రేకెత్తి నా బ్రహ్మచర్య దీక్షకు భంగం తెచ్చేదేమో."

"ఆ దినాలు స్మరణకు తెచ్చి మీా మనస్సు కష్ట పెట్టను కాబోలు."

"లేదు. అటువంటి మహదానంద ఘడియలు జ్ఞాపకము తెచ్చి మరింత ఆనందం కూర్చావు."

"మరి నాకు వంతు పెట్టారు కారేం, ఆ ఆనందంలో?"

[అంటూ ఉన్న ఊర్మిళ ముఖంలో కొన్ని కొత్త సూచనలు కనిపించేయి లక్ష్మణునకు.]

లక్ష్మణుడు—[దీనంగా]:—ఏమి ఊర్మిళా! నీ ముఖ పద్మ మేలకో వాడినట్లున్నది.

"ఆఁ"

"చెప్పవూ?"

"నాలో ఉన్నది అసూయనా. కోర్కె కాదు చెప్ప డానికి."

"అసూయతా? నీవు ఉదార స్వభావురాలవు. మహా సాధ్వి సీతామతల్లికి చెల్లెలివి. నీ హృదయంలోనూ అసూ యకు తావున్నదా?"

"స్త్రీహృదయం" అంది ఊర్మిళ, కర్కశంగా.

"నీ ఉద్దేశం చెపితే బాధ కొంచెం తగ్గుతుందేమో?"

"నా ఉద్దేశం సఫలం కావడానికి ప్రయత్నిస్తారూ?"

"అందుకే అన్నాను నువ్వు ఉదారస్వభావురాల వని. నువ్వు నన్ను తప్పక చెయ్యమనలేదే. మానవయత్నం మాత్ర మే ఆశించావు. అందుకు అభ్యంతరమా? నీ హృదయా వేదన తగ్గడానికేదేనా చేస్తాను."

"పిచిప విచారిస్తే లాభము లేదు."

"విచార మెందుకు?"

"ప్రేమ పరిణామం అలాగు ఉండాలి."

(లోనల్లో) "విస్ఫారిత ప్రియావదన పంకజమున మృత్యుదేవత ఆకారము కనిపిస్తూ ఉన్నది."

"ఆ కీకారణ్యంలో ఆ భయంకర వాతావరణం, ఆ భోజనం మీ బ్రహ్మచర్య దీక్షకు దోహద మిచ్చిందంటారే. ఇక్కడ నా స్థితి ఒక్కనాడేనా మీ మనస్సులోకి వచ్చిందీ?"

"ఉత్తర క్షణం నేను అయోధ్యకు బయలుదేరవలసి ఉండేది."

"చక్కటి ఊహ మీది. ఇచ్చటి వాతావరణం ఈ కోర్కెలకు కారణం అని ఒప్పుకుంటున్నారు."

"ఔను. అయితే, ఈ అనవసర తగ్గ మెందుకు?"

"మఱి నేనూ ఇన్నాళ్ళూ బ్రహ్మచర్య దీక్షలోనే ఉన్నాను కదా?"

"ఎవరు కాదన్నారు?"

"మఱి కష్టతర మెందు నా దీక్షా? మీదా?"

"నీదే."

"మనుగుడుపులైన మరునాడే మీరా వనాంతరాలకు వెళ్లిపోయేరే. మీ దేహం ఆ దేశాటనమువలన సడలినట్లు న్నది. నే నా? నవయౌవనోపేతను......"

"ఇదేనా నీ కోర్కె? భగవంతుని కృప ఉండాలి."

"ఇంతమాత్రమే కాదు."

"చెప్పి నా ముద్దు తీర్చవూ?"

"నా బ్రహ్మచర్యము వగ సాధించమని బోధిస్తున్నది."

"నామీదనే? నన్నిక్కడ విడచిపెట్టి నీ వొక్కతెవూ వనవాసంలో ఏలాగుంటావు?"

"అదికాదు నా కోరిక. మీ బుద్ధికుశలతే మిమ్ములను వంచించింది. నేను వెళ్లను. శ్రీరాముడడవికి వెళ్లాలి."

"హాతోస్మి. శ్రీరాముడు మళ్లీ అరణ్యానికి వెళ్ళాలీ? వెళితే నీ అసూయత తీరుతుందీ? నువ్వు పరియాచకం చేస్తున్నావు. కాని..."

"పరియాచకం కాదు."

"శ్రీహరీ! శ్రీహరీ! నాకు మతి పోతున్నది. నా ఇంద్రియాలు స్వాధీనం తప్పుతున్నాయి. ఏంచేతనో;"

"భ్రమ."

"నా స్థితికి కాదు. నీ కోర్కకు."

"వగ. నా కష్టం సీతకు తెలిసిరావాలి. తల్లి వంపున తండ్రిమాటలు నిలబెట్టడానికి అడవులకు వెళితే తానూ మగనితో పోయి కులుకుతూ కూర్చోడానికి మీరు చేసిన సాయం, అందులో ఇమిడివున్న నా బాధ కాస్తంతయినా తెలుసుకుందీ?

"మీతోటి నన్నూ తీసుకొనివెళితే ఈ చాకిరీకి లోటొస్తుందనే కదూ విడిచిపెట్టి వెళ్లిపోయారు. నేనూ మీకూడా ఉంటే ఆ లంకాకాండ అంతా జరిగేది కాదే?"

"పొరబడుతున్నావు ప్రేయసీ."

"నేనుకాదు పొరబడడం, మీరే. తల్లికంటె ఎక్కువగా పూజించిన మీకు ఆమె మీమర్యాదా ఏం దక్కించింది ? ఆ మాయలేడి వచ్చి కేకపెట్టినప్పుడు మీరు వెళ్ళకపోతే, యింతటి మహాసాధ్వి మీ హృదయం కనిపెట్టలేక ఎన్నెన్ని తిట్టింది. మీరు గీచిన గీటు దాటి ఆ మాయ రక్కసుని వలలో పడి తుదకు పతికే అనుమానము పుట్టించి అగ్నిపరీక్షతో కదా బయటకు వచ్చింది."

"దేవి! ఆమె ఆడిన దుర్భాషలన్నీ భర్తపై వుండే ప్రేమచేతనేగానీ......"

"అంతేమా, తానికే నెత్తితిపోయింది కదా, యిల్లాలు. మరి, నే పడ్డ వేదనో."

"ఎవరు కాదన్నారు ?"

"అదే అనుభవానికి తీసుకురావాలి."

"నీది బొత్తిగా మూర్ఖపు పట్టులాగుందే !"

"మిమ్మల్ని చెయ్యమన్నది ప్రయత్నమే కదూ !"

"శ్రీరాముని అడవులలోకి వెళ్ళమంటే మరి ఈ భూభారం భరించే దెవరు ?"

"భరతుడు లేడా, మీరు లేరా ?"

"సర్వరాజ్యాధిపత్యము చేపట్టమని కన్నతల్లి సంపాయించి యిస్తే కత్తిదూసిన భరతుడూ, అన్ననే దైవముగా చూచుకుంటున్న నేనూ రాముని కాదని రాజ్య మేలడమా? ఇంతకూ, శ్రీరాముడు మళ్లీ అరణ్యాలకు వెళితే రాజ్యములో విప్లవం పుట్టుకురాదూ ?"

"అప్పుడు రాని విప్లవం ఇప్పు డెందుకు వస్తుంది?"

"అప్పుడు తగిన కారణముంది. పితృవాక్య పరిపాలన కోసమని అరణ్యవాసం చేసేడు శ్రీరాముడు."

"ఐతే మీకు ఆడిన మాట నిలబెట్టుకో లేరన్న మాట."

"నా కోరిక సభ్యతగా లేదు."

"సభ్యతో అసభ్యతో జరిగితీరవలసిందే. నా మనసు కోరుతున్నది. నాకు సీతారాముల వియోగం కావాలి. శ్రీరాముడు వెళ్లడం అంత కష్టమయితే సీతనైనా పంపి నా మాట చెల్లించండి. లేదా, నన్ను నా దారిని విడచిపెట్టండి."

"ఛీ పో. నా ప్రాణం ఇమ్మన్నా యింతకంటే ఆనందంగా యిచ్చేవాడను. నన్ను పొమ్మన్నా మళ్లీ అడవులలోకి పోయేవాడిని. అంతేకాని, యిదెంతమాత్రం జరిగే పనికాదు. లోకం నన్ను మాట నిలబెట్టుకో లేనివాడిగా లెక్కిస్తే లెక్కించుకోని. కావలిస్తే నువ్వు నీ యిష్టం వచ్చిన రీతిని పోను. దేనికేనా సహిస్తాను. కాని, నీ కోరిక మాత్రం నాకు సమ్మతం కాదు."

"మీ అన్నగారు సీత ముద్దు చెల్లించలేదూ? మీరు నా మాట త్రోసిపుచ్చేరు. ఇదే మీకూ మీ అన్నకూ ఉండుకున్న భేదం."

"సరే. ఇంక చాలించు."

◆ ◆ ◆

"మహాప్రభూ! లక్ష్మణులవారి శయనగృహంలో రాత్రి యేదో రణగొణధ్వని అవుతున్నట్టున్నది." అన్నాడు చారు వొకడు శ్రీరామునితో.

శ్రీరాముడు:—"సరి, నువ్వు వెళ్లు."

లక్ష్మణుడు:—"అన్నా, నమస్తే!"

శ్రీరాముడు:—"శుభమస్తు. లక్ష్మణా! నాతో వనవాసము చేసిన యీ పదునాలుగేండ్లూ నిద్ర లేకపోయినా, నీ కళ్లెఱ్ఱబారలేదే, ఈ రోజున ఇంత ఎఱ్ఱబడి ఉన్నాయేం? నీ ముఖం చూస్తే హృదయంలో ఏదో ఆందోళన తాండవిస్తూ ఉన్నట్లుంది."

"లేదండి, అన్నయ్యా."

"అనృతం పలుకుతున్నావు."

"మిమ్మల్ని చూసి మనోమాట నోట రాకుండా ఉంది. రాత్రి సరిగా నిద్దర పట్టలేదు."

"అంతే కాదు."

"ఊర్మిళ......"

"ఆ? ఏం?"

"చె-ప్ప-లే-ను."

"నాతో చెప్పడానికి భయపడతావేం? నాన్నగారు దివి కేగి, యీ భూ భారమంతా నామీద మోపేరు. ఈ గృహకలతలే నేను తెలుసుకోలేకపోతే విశాలరాజ్యంలో జరిగే విచిత్ర సంఘటనలన్నీ తెలిసికొని రాజ్యమేలడం ఎల్లా?"

"మీతో చెప్పి మనస్సుకి బాధ కల్గించుటకంటె నేనాత్మహత్య చేసుకోవడం మేలు. అట్లా చేస్తా."

"అది నీకు తగిన పని కాదు. వంశాని కంతటికీ కళం

కం. ఏదో స్వల్పమైన గృహచ్ఛిదం తెచ్చుకొని లక్ష్మణుడు ఆత్మహత్య చేసుకుంటే రాముడెందుకు రాజ్యమేలడం అనదూ లోకం? చెప్పు. చెప్పక తప్పదు."

"శాసిస్తున్నారన్నమాట?"

"అవును"

"మీ ముందలి బ్రహ్మచర్యం పగ సాధించమని బోధిస్తున్నదట."

"సహజమే. స్త్రీహృదయం పరిపరి పోకడ పోతుంది. ఈ కోపం పోయిన తరువాత ప్రేమ అనుభవనీయంగా ఉంటుంది. సంతోషపట్టు లక్ష్మణా."

"ఆమె పడ్డ వేదన మీకు తెలియాలట—"

"సీత రావణలంకలో ఉన్నప్పుడు నేనూ సీతా అనుభవించేమని చెప్పలేదూ?"

"అది చాలదట."

"ఇంకా ఏం చేయమని ఆమె కోర్కె?"

"మీరు వనవాసం వెళ్తే సీతాదేవి ఈ అయోధ్యా వాతావరణంలో ఉండి..."

"ఆ మాత్రం ముచ్చట చెల్లించుతానని చెప్పలేక పోయావా? అరణ్యవాసం నాకు యిచ్చిన సుఖం ఇక్కడ లేనే లేదు. వెళ్లి ఊర్మిళతో చెప్పు. నేను సుమంతుని పిలిపించి పంపుతాను."

"నువ్వు మళ్లీ అడవులలోనికి వెళితే మాలో యీ భూభారం భరించగలవారు లేరు. విప్లవాన్ని ఆపలేము. అదు

గో, సుమంతుడే వస్తున్నట్లున్నాడు. సరియైన ఆలోచన చెప్ప గలడేమో."

♦ ♦ ♦

సుమంతుడు:—సార్వభౌములకు నమస్కారం.

"సుమంతా సమయానికే వచ్చేవు."

"ఏమి స్వామీ, విశేషం?"

శ్రీరాముడు:—"ఊర్మిళ బ్రహ్మచర్యం పగ సాధించమని కోరుతున్నదట."

సుమంతుడు:—"మళ్ళీ తమకు అరణ్యవాసమా?"

లక్ష్మణుడు:—అదే తప్పించాలి."

సుమంతుడు:—"సీతాదేవిని మునులకు దిగబెడితే?" అన్నాడు.

శ్రీరాముడు:—"బాగు, సుమంతా బాగు."

సుమంతుడు:—"పత్నీ వియోగ దుఃఖమువల్ల రాజ్యపరిత్యాగ..."

శ్రీరాముడు:—నన్ను శంకిస్తున్నా రన్నమాట."

లక్ష్మణుడు:—"కాదు."

సుమంతుడు:—"లేదు."

♦ ♦ ♦

"భయంకర మృగాలతో కూడుకొని నిర్మానుష్యంగా ఉన్నా, మునులున్న అడవులు ఎంతో మనోహరంగా కనిపించేవి. ఎంతో సుఖమిచ్చేవి కదు, నాథా!" అంది దహృది సీత శ్రీరామునితో.

శ్రీరాముడు:—నువ్వు నిజం చెబుతున్నావు. మళ్ళీ

కొన్నాళ్లుండాలని కోరిక లేదుకదా?

సీత:—వాస్తవమే, చెప్పవలసివస్తే నాకు ఉండిపోయిన కోరిక అదొక్కటే.

శ్రీరాముడు:—నీ కోర్కె యీడేరుతుందిలే.

సీత:—మిమ్మల్ని విడిచి ఉండలేను. అనుజ్ఞ అయితే ఒకసారి చూచి వస్తాను.

శ్రీరాముడు:—లక్ష్మణుడు తీసికొని వెళతాడులే.

సీత:—[అడవిలో] లక్ష్మణా, మన పూర్వ దినాలు జ్ఞాపకము వస్తున్నాయి కదూ?"

"ఔను తల్లీ"

"అదేమిటి లక్ష్మణా! నన్ను విడిచి రథము మళ్లిస్తున్నావు."

"నన్నడక్క తల్లీ."

"చెప్పక తీరదు."

"ఊరిలో ఒక చాకలి మీ లంకావాసం లెక్కిస్తూ దుర్భాష లాడాడట. అందుకు మిమ్మల్ని యిచ్చట విడిచిపెట్టి రమ్మని..."

"నిజమే?"

"ఆఁ."

"పురుషులు కర్కశ హృదయులు."

[ఏడుపు కళ్ళతో, అనృతం పలికానన్న బాధతో తిరిగి వచ్చేడు లక్ష్మణుడు.]

# ४. రాముడి రాజ్యం - భరతుడి పట్టం

ఎదురుగా కూర్చున్న అమాత్యపుంగవుడు అగు సుమంతు
నితో దశరథుడు :

"సుమంతా, నాకు వయస్సు మళ్లింది. రాజ్యపాలనా కాంక్ష తగ్గింది. సుపుత్రులు నలుగు రున్నారు కదా. ఈ రాజ్యభారం వారిపై మోపి యింక విరమిద్దా మని వుంది. నా భుజబలంవల్ల సంపాదించిన రాజ్యం నువ్వు కాపాడాలి. శ్రీరాముడు చిన్నవాడు."

"సార్వభౌమా, మీ కోర్కె సమంజసమే. పుత్రు లలో ఒకరిని పట్టాభిషిక్తుల జేసి తమరు విరమించండి."

"నీ పలుకులలో ఏదో ద్వంద్వార్థం కనిపిస్తున్నది, సుమంతా. నా కుమారులలో ఒకర్ని అని చెప్పక శ్రీరాముని పేరు చెప్పివుంటే ఆనందభరితుణ్ని అయ్యేవాడినే. శ్రీరాము నిపై నాకున్న నమ్మకము నీకు లేనట్లుంది?"

"ప్రభువులు సరిగా పసికట్టారు."

"మరెవర్ని మూర్ధాభిషిక్తుల్ని చెయ్యమని నీకోర్కె."

"శ్రీరాముని మించిన మేటి, భరతుడు అని ప్రజాభి ప్రాయము."

"సకారణమా?"

"పామరజనాభిప్రాయము అకారణమై వుండదు."

"ఇందుకు సాక్ష్య మున్నదా?"

"అది శ్రీవారే కనుక్కొనవచ్చు."

"ఏవిధంగా ?"

"రాజనీతియందు, పరిపాలనా జ్ఞానమందు ప్రశ్నించి చూచుకొంటే సరి."

"నీ నమ్మకముకూడా అదేనా ?"

"తమ తరువాత రాజ్యనిర్వహణయందు శ్రీరాముని కంటె భరతుడే మే లనిపించును."

"నీ అభిప్రాయమునకు గారణము ?"

"శ్రీరాముడు కేవలము కరుణామయుడు. అవతార పురుషుడు. ఇహలోక సంబంధి కాడు......"

"మానవాతీతమైన శక్తి ఉం దంటున్నావు కదా."

"కాని రాజ్యపాలనకు తగిన విద్యయందు మనము శ్రీరాముని ప్రవేశపెట్టలేదే."

"శ్రీరాముడు పరిచయమాత్రమున గ్రహింపలేనంతటి మూఢుడా ?

"అలా గంటినా ? శ్రీరాముడు నిష్కాముడు."

"రాజ్యము వద్దంటాడా ?"

"తమరే అడిగి తెలుసుకోవాలి."

"అయితే భరతుడు రాజనీతి నేర్చుకున్నాడా ?

"కేకయ సార్వభౌముడు తమకు భరతునియం దున్న నిరాదరణ చూసి నేర్పించె నని నా అభిప్రాయము."

"అది మెచ్చుటకైన ద్యోతక మైనదా ?"

"కా కేమి."

"నీకు శ్రీరాముడు రాజ్యాభిషిక్తుడగుట యిష్టము లేదన్నమాట."

"తమ తదనంతరము కొన్నాళ్లు భరతునివంటి వారు రాజ్యపాలన సాగిస్తే బంగారానికి వన్నె తెచ్చినట్లుంటుంది."

"నేను శ్రీరామునికే పట్టాభిషేకము చేస్తాను."

"తమ దయ."

"నాయందు చూపిన గౌరవమర్యాదలు, ఆదరాభిమానములు శ్రీరామునియందు కూడా చూపవలె. లేకుంటే నీవు రాజద్రోహి వన్నమాట!"

"నా రాజభక్తి నిష్కళంకమైనది మహారాజా!

"ఈ మన ప్రసంగము అతి రహస్యము సుమా!"

"అంతమాత్ర మూహించుకోన లేనా?"

♦ ♦ ♦

"దేవీ, నీ వీరోజున అత్యంత మనోహరంగా కనిపిస్తున్నావు. సౌందర్యదేవత నీలో మూర్తీభవించింది. ఇంతటి వృద్ధాప్యంలో కూడా ఇవాళ నా మనస్సు చలిస్తున్నది సుమా!" అన్నాడు దశరథమహారాజు తన ప్రేమంపు భార్యయైన కైకతో.

"తమరు అభిమానముతో చూస్తే ఎంతటి వికృతరూపమైనా సుందరవంతంగా కనిపిస్తుంది. ఇంతెకూ, వయస్సునకూ సౌందర్యమునకూ సంబంధమే ఉండదు కదూ." అంటూ భర్త దగ్గిర చేరి కూర్చుంది కేకయ రాజపుత్రి.

"లేదు దేవీ! వాస్తవమే చెప్పాలంటే మొదటినుంచీ నీ అందమే నన్ను ముగ్ధుణ్ని చేసింది!"

"మీకు పునర్యవ్వనం అంకురించినట్లుంది."

"ఆనాడు పరశురాముని ధాటి కోడి, చేత గాజులు తొడిగి మహిళామండలిలో లెక్కింపబడ్డవాడు వాస్తవంగా స్త్రీనై జన్మిస్తే ఎంతో మేలనిపించింది దేవీ!"

"ఆ పరశురాముని ప్రచండ బాహుబలజనితమైన భయమే దీనికి కారణమా?"

"కాదు. సౌందర్యమూర్తినై రాజరాజులను కూడ నా కనుసన్నలను త్రిప్పు మగవారి లలనాలోలత్వం వెలిపుచ్చడానికి. నేను చేత గాజులు తొడిగానంటే అందులో కేవలం నిమిత్తమాత్రుణ్ననిపిస్తున్నది. ఆ శ్రీహరి అవతారం నా పూర్వఫలంగా జన్మించవలసిన భాగ్యం నిర్ణీతం కావడంచేతనే నా కా బుద్ధి పుట్టిం దనుకుంటాను."

"మీ ప్రతి మాటలోను ఆ రాముని స్తోత్రం తప్ప ఇంకొకటి కనిపించదే!"

"శ్రీరాముడు నీకుమట్టుకు ప్రియుడు కాడూ?"

"నా కడుపున పుట్టిన భరతునికంటె ఎంతో ప్రియంగా చూచుకుంటున్న శ్రీరాముడు నాకు ప్రియుడు కాడూ?"

"అడగ మరిచేను, మన చిరంజీవి భరతుడేడీ?"

"స్వారికి వెళ్ళాడు."

"గడుసు పిల్లాడు."

"నిరాదరణ లక్ష్యము సేయక నున్నవాడు గడసరి కాక యేమగును?"

"అంత అనుమాన మెందుకు దేవీ. నా హృదయం నలుగురి తనయులికీ సమభాగం చేసి పంచుతాను."

"ఈ ప్రియోక్తుల కేం లెండి."

"పోనీ ప్రత్యేకం వాని కొరక రాజ్య మిచ్చి, రాజుని చేస్తాను."

"అది అసంభవము."

"కాదు. సంభవమే."

"కాలమే నిర్ణయించాలి."

"అందుకుగాను మాతామహుని ఇంటికిపంపి కొన్నాళ్లు శిక్షణ పొంది రమ్మంటే?"

"నాకేం అభ్యంతరము? అంధుడు చక్షువులను గాక వే రేమి కోరుతాడు?"

"అయితే ప్రయాణం కమ్మనకూడదూ?"

"సరే. రేపు ఉదయానే."

♦ ♦ ♦

"తండ్రీ, రామా! నువ్వు జ్ఞానం వచ్చినవాడ వయేవు. నేను వృద్ధు న్నయాను. ఇంక ఈ రాజ్యభారం నీకు వప్పగించాలని వుంది. నాకు విరక్తి జనించింది. నీకు సుమంతుడు తోడున్నాడు. అతడు రాజ్యతంత్ర ప్రవీణుడు" అని తనయుని శ్రీరాముని చేరదీస్తూ అన్నాడు దశరథుడు.

శ్రీరాముడు:— తండ్రీ! చిన్నప్పుడు నన్ను యజ్ఞసంరక్షణార్థం మునివాటికలకు పంపించి నాకు మహోపకారం చేశారు. నాకు ఆ అరణ్యవాసం యింతకన్న ఎక్కువ ఆనందాన్నిచ్చింది. తిరస్కార మనుకోకుండా మరి యెవరికేనా పట్టాభిషేకం చేస్తే నే నెంతో సంతోషిస్తాను. నా జీవితపరమావధి రాజ్యపాలన కాదనిపిస్తున్నది. నా అంతఃకరణ ఒక్కొక్కప్పుడు రాజ్యాన్ని విడువమంటున్నది.''

"వెఱ్ఱితండ్రీ. చిన్నవాడివి కాబట్టి అలాగన్నావు. కాని జ్యేష్ఠపుత్రుడే కదా రాజ్యార్హుడు."

"అగ్రహం కాదు నే నెంచినది..."

"మారు చెప్పకు."

"మీ మాట కెన్నడూ ఎదురాడను."

◆ ◆ ◆

దశరథుని తుదినిశ్చయము తెలిసినతరవాత సుమంతుడు ఇట్లా అనుకుంటున్నాడు :—

"శ్రీరాముడు రాజ్యార్హుడు. పట్టాభిషేకము చేయడానికి నిశ్చయించుకున్నాడు సార్వభౌముడు. కృతనిశ్చయుడైన దశరథునిచేత వేరుమార్గం త్రొక్కించడం నా తరం కాదు. కాని శ్రీరాముడే రాజైతే కొన్ని కష్టనష్టాల కోర్వాలి. కొంత అరాచకంకూడా జరుగుతుందేమో. పోనీ రాజ్యతంత్రం నేర్పిద్దామంటే విరాగిలాగ ఉంటాడు. శ్రీరామునికి అత్యంతప్రియుడు, అన్నివిద్యలలో ఆరితేరిన భరతుడు

అండగా ఉంటాడు కదా అంటే, దశరథునికి భరతునిపై అను మాన మెక్కువై మాతామహుని యింటికి పంపివుచ్చేను.

శ్రీరామునిపై ప్రజలకు ప్రేమ ఎక్కువగా నున్నా, రాజుగా భరతునే ఎక్కువ మన్నిస్తారని నా చారులవల్ల తెలుస్తున్నది. భరతుడు లేనప్పుడు శ్రీరాముని రాజుగా చేస్తే మోసగించే మనుకుంటారేమో ప్రజ. జనకుడు రాజర్షి. భూతభవిష్య ద్వర్తమానము లెఱిగినవారు. వారుకూడా నా అభిప్రాయముతో ఏకీభవిస్తారని నాకు దృఢవిశ్వాస ముంది.

నామాట లెక్కించకున్నా దశరథుడు జనకుని మాట త్రోసివుచ్చలే రనుకుంటాను. అందుచేత జనకునికి వర్తమాన మంపించి రావించితే యీ పరిస్థితులనుండి దాటవచ్చు నను కుంటాను.”

◆ ◆ ◆

“సుమంతా, యింకొక వారం దినములలో పట్టాభి షేకమునకు సుముహూర్త మున్నట్లు పురోహితులవారు చెబుతున్నారు. ఈ కార్యము సత్వరముగా కావాలి. ముని పుంగవులైన వశిష్ఠ విశ్వామిత్రులకు వర్తమానము చేసి ముహూర్తనిశ్చయము చేయించు. మన పట్టణమందు, రాజ్య మందు ఆనందం ఉట్టిపడాలి. ప్రతియింటా ఉత్సాహం ప్రతి ఫలించాలి. మన వలసరాజ్యాల్లో కూడా అలాగే జరగాలి. సామంతు లందఱికీ అతి వేగిరం కబురంపు. ఎందునా లోటు పాటు కనిపించరాదు. పట్టాభిషేకానికి వచ్చే అతిథి అభ్యా

గతు లెంద ఉన్నా, వారివారికి ఉచితరీతిని మర్యాదలు జరగాలన్నమాట నీకు తెలిసిందే కదా. 'ఆనందో బ్రహ్మేతి' అన్నపదం ఈ సమయంలో సార్థకం కావాలి. కర్చుకు చూడ వద్దు. జాగ్రత్త" అంటూ దశరథుడు సుమంతునికి ఆజ్ఞ యిచ్చేడు.

"శ్రీవారు తలుచుకుంటే సాధ్యం కాని కార్య మేది? అతిథిసత్కారాలకు పేరెక్కిన వంశం! కొదవ రానిస్తానా? అది యెవ్వరూ శంకించరు. కాని......" అని యేమో మనవి చేస్తున్నాడు సుమంతుడు.

"మొదటినుంచీ హంసపాదులు పెడుతూనే వున్నావు. ఆ 'కాని' అన్నదాని అర్థమేమిటి?"

"జనకుని కోరికను వర్తమానమే వెళ్లలేదు. శ్రీరాముడు ఆయనకు కూడా పుత్రతుల్యుడు కదా. తొలుదొల్త జనకునికి తెలియజేయటం మన విధి."

"అంతమాత్రము నాకూ తెలుసు. ఈ పట్టాభిషేక మహోత్సవసందర్భములో సర్వమూ నా యిష్టానుసారమే జరగాలి. జనకుడు రాజేంద్రులలోకంటె ఎక్కువ మునీంద్రులలో లెక్కింప తగినవాడు. అతడు త్రికాలవేది. గతానుగతము తెలిసినవాడు కాబట్టి నీ అభిప్రాయముతో ఏకీభవించితే నాకార్యం భంగమౌతుంది."

"తెరువాత మనం మాట పడవలసి వస్తుందేమో."

"అందుకు నేనే బాధ్యుడను.

"నామీద నేరం ఆరోపిస్తారు సుమండీ."

"ఇందున కీర్తి వచ్చినా, అపకీర్తి వచ్చినా నేను భరిస్తాను. కాలయాపన చేయక, కావలసిన యత్నాలు కానీ."

"తమ ఆజ్ఞకు అడ్డు లేదు."

"నేను నా నిశ్చయము నీతో చెప్పి ఆరునెలలయినా, యింకా యింట్లో ఎవరికీ తెలియనీయలేదు. ఇప్పుడే పోయి ఈ శుభవార్త ఎఱిగించాలి. వర్తమానాలు వాయువేగ మనోవేగంగా అందించాలి. మరి నే వెళతాను." అని సుమంతునితో చెప్పి లేచివెళ్లేడు దశరథుడు.

♦ ♦ ♦

"ఏమో అలసిన ట్లున్నారు." అని ప్రశ్నించింది కైక, అప్పుడే తన మందిరానికి వచ్చిన దశరథుని.

"అలసట కాదూ? కాలినడకను మన ప్రాసాదమంతా తిరిగితే" అన్నాడు దశరథుడు, ఎదురుగా ఉన్న వేదికపై కూర్చుంటూ.

"ఏమి టంత అవసరము?"

"అవసరమా? శుభవార్త చాటడానికి."

"నాకు చెప్పరేం?"

"చెప్పకేం? మరెందు కొచ్చేను యిప్పుడూ. మన శ్రీరాముని మూర్ధాభిషిక్తుణ్ని చేస్తాము. న్యవధి లేదు. ఒక్క వారమే గడువు. మనమందరమూ ఏకీభవించి జరిగించాలి యీ కార్యము. ఇందులో నీ బాధ్యత చాలా ఎక్కువ సుమా. కార్యభారం యావత్తూ నీదే."

"అబ్బా! ఎంతటి టక్కరితనం. ఈ శుభవార్త ఇప్పటి

వరకూ చెప్పకుండా నాదగ్గర దాచిపుచ్చినందుకు కోపగిస్తానేమో అని బుజగింపు కాబోలు. కాని నాకింతకంటె ప్రియమైన కార్యం యేమున్నది? కనక, ఈ చిన్నతనానికి నేను వ్యథ పొందనులెండి. ముహూర్తనిశ్చయ మైనదా?"

"లేదు. వశిష్ఠులవారికి వర్తమానం పంపాము."

"మన చిరంజీవికీ, మా నాన్నకూ ఆహ్వానాలు వెళ్లాయా? ఎప్పుడొస్తారు."

"ఇంకా వెళ్లలేదు."

"లేదూ? నిరాదరణ మూర్తీభవించింది మీలో."

"నిరాదరణ కాదు, దేవి. ఇప్పుడే తెలియచేదాం. కాని పట్టాభిషేకానికి ఆహ్వానించడమా లేదా అని ఆలోచిస్తున్నాను."

"దానికి ఆలోచన కావాలా? ఇటువంటి ఆనంద సమయములో భరతుడు లేకపోవడమా? ఇదంతా చూస్తే, భరతుణ్ణి మాతామహుని యింటికి పంపించడంలో ఏదో మాయోపాయ మున్నట్టుంది. ఉత్తరక్షణాల్లో భరతుడు పట్టణానికి రావాలి. లేకపోతే మీరు చెయ్యబోయే పట్టాభిషేకానికి అక్షతలు రాగలవు. శ్రీరాముడు మీకు ప్రియుడైనా భరతుడు నాకు అంతకంటే ప్రియుడు. మీ కార్యసాఫల్యం కావాలంటే భరతుణ్ణి రావించండి."

"దేవి, నీ తొందరపాటుకి కారణం కనిపించలేదు. అంతగా నీవు పట్టుపడితే యిప్పుడే వర్తమానం పంపిస్తాను. కాని సహోదరులకు సహజవైరం పౌరుషవంతుడైన భర

తునిలో ఉద్దేశమైనదంటే ఏవిధంగా పరిణమిస్తుందో" అని అన్యాపదేశంగా తప్పిపుచ్చేడు.

"ఇప్పుడు మా తండ్రికి ఆహ్వానం పంపకపోతే పరాభవం చేసిన ట్లవుతుంది. పరాభవమున కోర్చి యెఱుగదు మా వంశం. అదిగాక, భరతునియందు మీ కనుమాన మున్నట్లున్నది. నా ప్రూహ సరియైనట్లయితే—భరతుడు రాజ్యతంత్రమునందు శ్రీరామునికన్న నేర్పరి అని మీ కెవరేనా చెప్పివుండాలి. అదే నిజమైతే భరతునే ఎందుకు రాజుగా చేయరాదు. శ్రీరాముడుకూడా యిందుకు కాదనడే. భరతుడు మాత్రము మీ కుమారుడు కాడా?"

"కాదన్నానా? శ్రీరాముడు రాజ్యార్హుడు. భరతుని కెట్లా పట్టం కట్టేది? అది అసంభవమైన కోర్కె. నీవు నాకు అడ్డు చెప్పవద్దు. ఏది ఎట్లయినా శ్రీరాముని మూర్ధాభిషిక్తుని చేసితీరుతాను. భరతుడు గడసరి కావచ్చు; నేర్పరి కావచ్చు; కాని రాజ్యార్హుడు కాడు."

"శ్రీరామునికన్నా భరతునే రాజుగా ప్రజలు మన్నిస్తారని నావలెనే నీవును చారులవలన విని యుండవచ్చు. కాని ఈ విషయంలో ప్రజాభిప్రాయమును నేను లెక్కింపవలచుకో లేదు. భరతుని పట్టాభిషిక్తుని చేయను. నా నిశ్చయాని కెవ్వరు అడ్డు చెబుతారో చూస్తాను."

"నిశ్చయాల మాటకేం లెండి. సాత్వికంగా పోతే కార్యసాధన మవుతుంది కాని, బింకాలు పలికితే..."

"నీవు యెవరిని యెదిరించి మాట్లాడుతున్నావో కొంచెం తెలిసికో."

"తెలియకేమి. వాక్పరిపాలనయందు వన్నెకెక్కిన యిక్ష్వాకు కులస్థులను."

"మా కులసాంప్రదాయమే కాక నా భుజబలంకూడా తెలిసికో.

"వాచాలునికి దక్క నాగ్గాటిముందరి భుజబల మే మూలల ?"

"నే వెళ్ళవలసిన వేళైంది."

"క్షమించాలి. కొద్దిగా మీ అవసరముంది."

"త్వరగా చెప్పు."

"నే డిట్లు నన్ను తోసివుచ్చిన నాయందు తొల్లి మీకుండే ప్రేమ వేనోళ్ల చాటడానికి నన్ను మీతో రణరంగానికి కూడా తీసుకొనిపోయి—అచ్చట నే చేసిన సహాయము బహు కొంచమైనా నాకు రెండువరము లిచ్చివున్నారు, జ్ఞాపకమున్నదా ?"

"జ్ఞాపకమున్నా లేకపోయినా నేను వెనుదీస్తానని మాత్రం నీవు జంక పనిలేదు. నీ క్కావాలంటే ఆ రెండే కాక మరి రెండువరము లిస్తాను. కోరుకో. ఇప్పుడే ఇస్తాను."

"మీరు చాలా కోపంగా ఉన్నారు. నా వరము లిప్పుడే కోరుకుందామంటే..."

"అందుకు సిద్ధముగా నుండవలసిన అవసరము లేదు.

రఘువు మా పితృదేవతలల్లో ఒకడని జ్ఞాపకముంచుకో. కాల యాపనకు వేళ లేదు."

"భరతునికి పట్టాభిషేకం చెయ్యాలి — అది నా మొదటి వరం."

"శ్రీహరీ! రెండవది?"

"శ్రీరాముడు అరణ్యానికి పోవాలి."

"హా! హా!! నా సర్వస్వమూ, చివరకు నా ప్రాణాలైనా ఇమ్మంటే ఇంతకంటే హాయిగా వుండేది. దేవీ, పరియాచక మాడుతున్నావా?"

"శ్రీరామునికి పట్టాభిషేకము చెయ్యడం పరియాచకమంటే?"

"నీ కోర్కె సమంజసంగా లేదు సుమా."

"అంతతో నాకు నిమిత్తం లేదు."

"నారాయణ! నారాయణ!!" అంటూ మూర్ఛిల్లాడు దశరధుడు.

♦ ♦ ♦

పరిచారకుల నోట విన్నాడు తండ్రి అవస్థ. పినతల్లి మందిరానికి చేరుకున్నాడు. తండ్రికొచ్చిన మూర్ఛకు కారణం కైక నోట తెలుసుకున్నాడు.

"తల్లీ, నా మనస్సులో వుండే వాంఛను నీవు సమంగా ఊహించి కోరేవా అనిపిస్తున్నది నీ కోర్కెలు. కొద్దిరోజుల క్రిందటనే నేను ఈసంగతే మనవిచేశాను నాన్నగారితో. నీ కోర్కె తప్పక నెరవేరుస్తాను. సెలవియ్యి తల్లీ......తండ్రీ!

మన వంశానికి కళంకం రానడం నా కిష్టం లేదు. నే నడవులకు వెళుతున్నాను. నా తమ్ముడు భరతునికే పట్టం కట్టు" అన్నాడు శ్రీరాముడు.

"అయ్యో! శ్రీరామా! నీవు లేని జగత్తు అంధకారము. దుఃఖమయము. జన్మ వ్యర్థము. నీతో నా అసువులుకూడా తీసుకుపోరాదూ?" అంటూ దివంగతు డయ్యాడు దశరథుడు.

---

## ౫. ముప్పు తెలియకకాదు, ముక్తికోసమే!

"దేవీ! మండోదరీ! విహార వాంఛలకు తృప్తి ఉంటుందని అనుకోను. నే ననుభవించని సుఖమే లే దనుకుంటాను. చేయవలసినన్ని యజ్ఞయాగాదులు చేసేను; తపస్సూ చేసేను. నా బాహుబలానికి ముల్లోకాలూ దాసోహమన్నాయి. నాకు లేనిదే లేదు. ఇంతటి ప్రతిష్ఠ ఇచ్చి, బ్రహ్మ నన్ను అసురులలో పుట్టించినందుకు అప్పుడప్పుడు చింతిస్తూ ఉంటాను. ఇది తప్ప అన్యచింత నాకు లేదు. ఒకోకప్పుడు...ఈ జన్మ చాలిస్తే బాగుండు ననిపిస్తూ వుంది."—అన్నాడు లంకాధీశుడైన రావణుడు, భార్య మండోదరితో.

"నాథా, ఎన్నడూ లేని ఈ వైరాగ్యధోరణి ఇప్పుడెందుకూ? మీరు అన్నట్లుగా, మీ రనుభవించని సుఖము లేదుకదా? ఆనందమయంగా దినాలు జరిగిపోతున్నప్పుడు

నువ్వు పాలించవలసిన కోరిక ఎందుకు పుట్టాలి? ఇంతకూ చావు పుట్టుకలు మన చేతుల్లోనా? సర్వజ్ఞులైన మీకు నేనా చెప్పడం! సృష్టి-స్థితి-లయ-కారకులు వారు. వారి నియమిత కృత్యాలు మనం కోరకే చేస్తూఉంటారు కదా? మనం తొందరపడవలసిన అవసరమేమిటి?" అన్నది మండోదరి నగవుతో.

"కాదు ప్రేయసీ, నీవు పొరబడుతున్నావు. నా మరణము అనేది సాధారణమయినది కాదు. నేను కోరితే నాకు మరణం రాదు. అందుకు కేవలమూ ఆ శ్రీమన్నారాయణుడే అవతరించాలి. ఇంకా నా తపస్సంతా ఏమయిందనుకున్నావు?"

"ఏమిటీ? మీ ప్రాణాలు తీయడానికే ఆ శ్రీమన్నారాయణమూర్తి ఈ లోకంలో అవతరిస్తాడా!"

"నా పూర్వచరిత్ర తెలియక అలాగు అన్నావు. నా మారకుడు ఎక్కడ పుట్టినాడో నాకు తెలుసు. ఇంక వానితో కయ్యము తెచ్చుకుంటే నా కోరిక సఫలమవుతుంది."

"అయ్యో! నా పసుపు, కుంకాలకి లోటు తెస్తారా?"

"నీకు పుట్టుకా పరమేశ్వరుడు ముక్తి నివ్వడూ?"

"కోరి కోరి కయ్యము తెచ్చుకొని మరణిస్తే అది ఆత్మహత్య కాదూ? ఇంతటి జ్ఞానవంతులూ ఆత్మహత్యకు పూనుకుంటారా?"

"మన నియమిత ఘడియలు వచ్చేవరకూ ఆ శ్రీహరి మన చెంత రానేరాడు."

"మీ వేదాంతానికి అంతులేనట్లుందే."

"వేదాంతం కాదు. ఇట్టి కోర్కె కూడా కాల మాహ
త్మ్యము కాబట్టే పుట్టింది. కాబట్టి నే చేయబోయే కార్యక్ర
మము చూస్తూ ఉండు. నీవు ప్రేక్షకవర్గంలో ఒకరివే
సుమా!"

"మమ్ములను ఎదురాడగలనా?"

◆ ◆ ◆

"అన్నా!"

"ఎవ రది?"

"చెలియలు శూర్పణఖ."

"అయ్యో! అదేమి? నీ ముక్కూ చెవులూ ఖండింప
బడినవే? నీ ముఖము రక్తసిక్త మైనదే? నీ వేమిటి, యింత
టిటి పరాభవానికి లోబడడ మేమిటి? నీ కే అపరాధము
చేసినవా రెవరు? తగిన ప్రతిక్రియ చేసాను. చెప్పు. త్వరగా
చెప్పు." అన్నాడు రావణుడు.

"అన్నా! నీ వంటిటి ఘోర ప్రతిజ్ఞ చేయకు. నాకు
చేసిన అపకారానికి నేనే విచారపడటం లేదు. నేను పంచ
వటిలో విహరిస్తూ ఉండగా యిరువురు రాచబిడ్డలు ఒక స్త్రీని
వెంటబెట్టుకొని ఉండడం చూచేను. వారు ఎంతటి మనోహరు
లనుకొన్నావు? మన్మథ స్వరూపులు. వారి ముఖంలో దేవ
కాంతి ఉట్టిపడుతూ వుంది.

వారి వనవాసంలో ఏదో గూఢార్థం ఉందనుకుంటాను.
వారిని చూచేసరికే నా మనస్సు చలించింది. ఆ యిరువురినీ
వలలో వెయ్యడాని కెన్నో మాయోపాయాలు పన్నేను.

అన్నీ నిష్ఫల మయ్యేయి. తుదకు ప్రేమభిక్ష వేడేను. వారు గృహస్థులట. నాకు నీతులు చెప్పేరు. వినకుంటే నాకీ శిక్ష విధించేరు.

శిక్షించినా వారిపై నాకేదో గౌరవభావమే ఉంది. కాని ఆ స్త్రీ—ఎంతటి సౌందర్యవతి అనుకున్నావు! మారుని చేతి పూబంతి! ఆడదాన్నైన నాకే ఆమెపైన మోహం కల్గింది. నీవు చూస్తే మరి విడవ్వు. నీకు అనుమాన ముంటే ఎవరినేనా పంపి నిజం తెలిసికో" అన్నది శూర్పణఖ.

"నీవు చెప్పినదంతా ఆశ్చర్యంగా ఉందే. వారు మానవాతీతమైన శక్తిసంపన్నులై వుండాలి. లేకుంటే నీకీ శిక్ష విధించగలరా? రాచబిడ్డ లన్నావు, వా రెక్కడివారో తెలుసునా?

"తెలియకేం. అయోధ్యాధీశుని తనయు లట."

"ఏమిటీ?—దశరథ తనయుడు శ్రీరాముడా?"

"అన్నా! నీ ముఖవిలాసం మారిందేమి?"

"ఏమీ లేదు. మారీచు డేడీ?"

"ఎందుకన్నా?"

"నే నా కాంత నిక్కడికి తెప్పిస్తాను."

"నే పోయి మారీచుని పంపుతాను. కాని, అన్నా, తొందరమాత్రము పడబోకు. ప్రాణహాని రాగలదు సుమా!"

"నా జాగ్రత్త నాకు తెలియదూ?"

"నా శిక్షకు మాత్రము ప్రతిక్రియ చేయవద్దు. వారి పునర్దర్శన భాగ్యమే కోరుతున్నది నా మనస్సు."

"వారిని నే శిక్షింపగల సమర్థుణ్ణి."

"ఏమి? అంతటి శూరులా?"

"శూరులే కాదు. అవతార మూర్తులు."

"నువు ఆమెను కావాలనుకున్నావే?"

"అందుకు కారణ ముంది. ఆ పని చేయుటకే మారీచుని పంపు. నే నింతలో మరొకసారి చూచి వస్తాను."

◆ ◆ ◆

"మనోహరీ! ఆడబోయిన తీర్థ మెదురైంది. పంచవటిలో శ్రీరాముడు సీతతో వనవాసం చేస్తున్నాడు. ఇక కయ్యానికి కాలు దువ్వాలి." అంటూ ఆనందమిళితమైన కంఠంతో రావణుడు మండోదరితో చెప్పాడు.

"అయ్యో! ఇక మీతో ఆనందంగా గడపవలసిన దినాలు అయిపోయినట్లేనా?" అని విచారసూచకమైన గొంతుకతో అడిగింది మండోదరి.

"దేవీ! నీ వలా చింతించవద్దు. ఇందువల్ల నీకూ నాకూ ముక్తి కలుగుతుంది. ఇంక నే పోయి అందుకు తగిన ప్రయత్నం చేస్తాను. కరుణామయుడైన శ్రీరామునితో కయ్యము తెచ్చుకోవటం సాధారణ విషయం కాదు" అంటూ వెళ్లిపోయాడు రావణుడు.

◆ ◆ ◆

"దానవ సార్వభౌమా! నమస్కారము" అన్నాడు మారీచుడు.

"మారీచా! నీవు నాకు ప్రియులలో ప్రథముడవు.

కాబట్టి నిన్నొక కార్యసాధనయందు నియమిస్తున్నాను. ఇరువురు రాకుమారులును ఒక యిల్లాలును పంచవటిలో వనవాసం చేస్తున్నారు. అందులో నీలవస్త్రుని భార్య ఆ యింతి. ఆ హరిణేక్షణకు హరిణములందు ప్రేమ మెండు. నీవిప్పుడా పంచవటికి పోయి ఆమె కెదురుగా లేడి రూపులో కనిపించాలి. నీ మేను మిసిమిఛాయతో మెరిసిపోవాలి. నీ వెంట్రో అపురూపమైన అందంతో వెలిగిపోవాలి. వారు నిన్ను పట్టుకోడానికొస్తే పరుగెత్తాలి. ఆ నీలవస్త్రుడు నిన్ను వెన్నాడినట్లయితే దూరంగా తీసుకుపోయి అక్కడ "హా లక్ష్మణా!" అంటూ నిజరూపం దాల్చి వెళ్లిపోరా" అని ఆజ్ఞ యిచ్చాడు రావణుడు.

"దేవా! కారణ మెరుగవచ్చునా?"

"అది నీ కనవసరము."

"మహాభాగ్యం."

◆ ◆ ◆

"ప్రియా! ఈ లేడిపిల్ల ఎంత ముద్దుగా ఆడుకుంటున్నదో!"— అన్నది జానకి తన ప్రియునితో.

"ఔను ప్రేయసీ! నీకు హరిణములంటే ఎంతో మక్కువ. ఈ వనమందున్నవన్నీ తెచ్చి యివ్వనా!" అన్నాడు శ్రీరాముడు.

"ఆ. అదిగో! ప్రియా! ఆ లేడి!! ఎంత రమ్యంగా ఉంది!!! పసిడిఛాయను నుంచి దాని దేహం! నాకది కావాలి; తెచ్చియ్యరూ?"

"కొంతతడవంటే అదే కాదు, ఇంకా ఎన్నో తెస్తాను. కాని ఆ ఛాయ చూస్తే నా కేదో అనుమానం వేస్తున్నది."

"ఇప్పుడిప్పుడే కదూ నాకు వనమందున్న హరిణము లన్నీ తెస్తా నన్నారు. కాని నే కోరి తెమ్మంటే ఏవో సాకులు చెప్పి మభ్యపరుస్తున్నారు."

"నీ వలాగు కోపగించకు ప్రేయసీ. ఇదిగో పోయి వస్తాను. తప్పక తీసుకువస్తాను. లక్ష్మణా! జాగ్రత్త. జానకిని మాత్రం ఒంటరిగా విడిచిపెట్టకు. ఏం?—" అని మాయ లేడిని వెంబడిస్తూ వెళ్ళిపోయేడు శ్రీరాముడు.

♦ ♦ ♦

"ఏమది? ఒక్క లేడిపిల్లను వేటాడి పట్టడాని కింత సేపయిందా? ఎంతటి భీకర వన్యమృగాలైనా అతివేగంగం ఒక్క బాణానికే పడడమే. ఇది యేదో మాయ అని నా మనస్సు చెప్పక చెబుతున్నది. పర్ణశాల వదిలి ఎంతో దూరం వచ్చేశాను అప్పుడే. ఇంకా చిక్కలేదు. పాపం, జానకి ఏమనుకుంటుందో. తెస్తానని నమ్మించేను. పట్టుకు వెళ్ళకపోతే చిన్నబుచ్చుకుంటుంది. కడాపటి యత్నం చేస్తాను. అంతతో ఆ లేడి పట్టుబడినా సరే. చచ్చినా సరే." అంటూ ఒక్క బాణం విడిచిపెట్టేడు శ్రీరాముడు లేడి వెసకు.

"తన కృత్య మీడేరింది కదా అని "హా లక్ష్మణా!" అంటూ నేల కూలేడు మాయ లేడిగా వచ్చిన మారీచుడు. "లక్ష్మణా" అంటూ వచ్చే డీ మాయలమారి. ఇది విని

లక్ష్మణుడు జానకిని విడిచి రాడుకద!" అనుకున్నాడు శ్రీరాముడు.

♦ ♦ ♦

"అదేమిటి లక్ష్మణా, ఆ ఆర్తనాదం? మీ అన్నగారి గొంతుక లాగు ఉంది. ఏమి కీడు మూడిందో? నా మనస్సు ఆతాపడుతూంది. నీవు పోయి చూసిరా" అన్నది చలించిన మనస్సుతో సీత.

"అమ్మా! జానకీ! మా అన్నగారి కెన్నడూ భయము లేదమ్మా! ఆ లేడి దేహచ్ఛాయ అనుమానాస్పదంగా ఉం దని మా అన్నగారు ఇక్కడే అన్నారుగా? అది యేదో మాయ అయి వుండవచ్చు. నేను పో నవసరము లేదమ్మా!" అని జబాబు చెప్పేడు సౌమిత్రి.

"నీవు వెళ్ళక తప్పదు. ఆలస్యం చేస్తివంటే నే నన్యథా తలపవలసి ఉంటుంది." అని కఠినంగా అంది సీత.

"హరి హరీ, అంత మాట వద్దు తల్లీ! ఇదే నేను వెళ్ళుతున్నాను. కాని తల్లీ, నే గీచిన ఈ గీటుమాత్రం దాటి పైకి పోబోకు." అంటూ పర్ణశాల చుట్టూ ఒక గీటు గీచి వెళ్ళిపోయేడు లక్ష్మణుడు ఆర్తనాదం వినిపించిన దిక్కుగా.

♦ ♦ ♦

"భిక్షాందేహి మాతా!" అన్నాడు భిక్షుక చక్రవర్తి వేషంలో ఉన్న రావణుడు, పర్ణశాలముందు నిలబడి.

"భిక్షూ, సమయం కాని సమయంలో వచ్చేవు. నే నివ్వ దేమివ్వగలను" అన్నది ప్రేమమయి సీత, గుమ్మంలో నుంచొని.

"తల్లీ నేను సర్వమూ త్యజించిన సన్యాసిని! ముక్తి మార్గము వెతుకుతూ పోతున్నాను. నీ చేత్తో నీ వేమిచ్చినా అమృత తుల్యంగా స్వీకరిస్తాను తల్లీ!"

"ఉండు భిక్షుకా, చూచి వస్తాను ఏమైనా ఫలరసాదులు ఉన్నాయేమో.

"ఏ మిచ్చినా సరే, తల్లీ!"

"ఇవిగో ఇంద, ఇటురా. ఇవి తిని కొంచెం సేద తీర్చుకో. పాపం మార్గాయాసంవల్ల కాబోలు అలిసినట్టున్నావు."

"ఔను తల్లీ! మఱి యిచ్చటనుంచి కదలలేను."

"అయ్యో నే నీ గీటు దాటకూడదే!"

"పోనీ తల్లీ! చావొచ్చినా మే లనిపిస్తూంది."

"ఎంతమాట! పాపం! ఆగు. ఇవిగో" అంటూ, గీటు దాటి వచ్చిన సీతను రావణుడు నిజరూపం దాల్చి తీసుకుపోతున్నాడు.

"మాయావీ! మా మఱిది లక్ష్మణుని మాట దాటి నందుకు తగిన శిక్ష చేసినావు. కపట సన్యాసీ!"

"తల్లీ! నన్ను దూషించకు. నేను అనృతం పలకలేదు. నా ముక్తికి నీవు కారణభూతురాలవయ్యావు! నాకు మోక్ష భిక్ష పెట్టేవు. నా గాథ యావత్తూ నీకు తెలియజేస్తాను. నేను నిన్నెక్కడకు తీసుకుపోతున్నదీ అదిగో ఆ యెదురు వస్తున్న జటాయువు నీ మగని కెరుకపరుస్తాడు." అంటూ

జటాయువు నెదుర్కొని ఓడించి తీసుకుపోయేడు సీతను రావణుడు.

• • •

(లంకలో)

"తల్లీ! జానకీ! నీ వత్యంత సౌందర్యవతురాలవు! నీ అప్రతిహతమైన నీ సౌందర్యం నపుంసకులనైనా చలింప జేస్తుంది. నీమీద యీగ వాలకుండా, నీ శ్రేయానికి లోటు రాకుండా, నీ మానానికీ మర్యాదకూ వెల్తి రాకుండా చూచే బాధ్యత నాది. ఒరుల దృష్టి నీమీద పడకుండా ఉంచాలి కాబట్టి, తల్లీ!—నీ వా ఆభరణాలు తీసేసి, జట్టు విరబోసు కొని, నా మందిరానికి రాకుండా యిదిగో ఈ ఉద్యానవనమందే ఉండు. ఇక్కడ నీకు కావలసినంతమంది నౌకరులు ఉంటారు. నీ సౌకర్యాలన్నీ వారు చూస్తారు." అంటూ సీతను నమస్కరిస్తూ చెప్పేడు రావణుడు.

"రావణా! నీ సంభాషణలో ఉన్న మర్యాద, నీవు చూపిన ఆదరాభిమానాలు మెచ్చదగినవే కాని, నీవు ఇంతటి విశాల రాజ్యానికీ సార్వభౌముడవుగా కనిపిస్తున్నావే— నన్నిలాగు మాయలు పన్ని దొంగిలించుటలో అర్థమేమిటో తెలియడంలేదు." అంది సీత.

"తల్లీ! నా విషాదగాథ నీకు తెలియజేస్తే నీ అనుమానం తీరిపోతుంది. తొలి జన్మమందు నేను శ్రీహరి దౌవారికుడను. అచ్చట నుండగా—నా ప్రారబ్ధ మన్నట్లు—సనక సనందనులు శ్రీహరి దర్శనార్థము వచ్చుసరికి మమత తప్పి

వారిని చిన్నబుచ్చేము. అది శ్రీహరి తెలిసికొని మమ్ములను మూడు జన్మల వైరి గండని శపించేడు. ఆ శాప కారణమున నాకు ఈ జన్మ వచ్చింది.

ఇన్నాళ్ళకు ఈ జన్మ చాలించాలని నాకుంది. ఆ ఆది పురుషుని అవతారమూర్తి నీ భర్త శ్రీరాముడు. అతనితో యుద్ధమాడి నన్ను కౌగలించేను. అంతే కాని వేరు వాంఛ లేదు. తల్లీ! ఇంకిప్పుడు నీకు శంకా నివృత్తి అయిందా?"

"నీ చర్యలు ఆశ్చర్యంగా ఉన్నాయి! అబలను దొంగిలించి తెచ్చి బంధించివుంచితే మర్యాద కాపాడతాడని నీవు అన్నా ఎవరేనా నమ్ముతారా?"

"అబలవు, నిస్సహాయవు, ఏకాకివి, నిన్ను నా అంతఃపురంలోనికి తీసికొనివెళ్లి బలాత్కరిస్తే అడ్డేదెవరు తల్లీ! నిన్నందుకే నే యిక్కడ విడుస్తున్నాను. ఇంకను నమ్మకపోతే నా కర్మ అనుకోవాలి."

"మరి వాలివద్దనుంచి తెచ్చుకున్న మండోదరిని నీవు పట్టమహిషిని చేసుకున్నావు కదా!"

"అందుకు వాలి సమ్మతముకూడా వుంది జానకీ!"

"నువ్వు మండోదరినే కాక ఎందరినో చెరపట్టి నట్టు విన్నామే!"

"దినములతో పాటు నా చర్యలుకూడా మారాయి."

"ఇప్పుడీ వేదాంత మెందుకొచ్చింది?"

"నాలో హరిసేవాతత్పరత హెచ్చింది."

"నువు నన్ను తెచ్చినంతమాత్రాన శ్రీరామునితో

కయ్యేమొస్తుందని నమ్మకముందా ?"

"నాకు దృఢ విశ్వాస ముంది."

"శ్రీరాముడు నా యందుండే ప్రేమచేత నిన్ను క్షమిస్తే ?"

"తల్లీ ! నిన్ను చెరబట్టనున్నానని అన్నతమాట రోషా వేశ పూరితుణ్ని చేస్తాను."

"అప్పుడు నాకు కళంకం రాదూ ?"

"నీవు అయోనిజాతవు. లక్ష్మీస్వరూపమువు. అంతగా శ్రీరాముడు నిన్ను శంకిస్తే అగ్నిపరీక్ష చేసినా నిష్కళంకంగా బైటకు రాగలవు."

"నీవు నన్ను దొంగిలించినట్టే ఆ శ్రీరాముడుకూడా ఏవో మాయలు పన్ని నన్ను తీసుకొనిపోతే ?"

అందుకు జాగ్రత్తగానే వున్నాను."

♦ ♦ ♦

"లక్ష్మణా ! నే నెన్ని చెప్పినా సీతను ఒంటరిగా విడిచి వచ్చేవేం ?" అని ఆతృతతో అడిగేడు శ్రీరాముడు.

"అన్నా ! నీ ఆర్తనాదం విని జానకి నన్ను వెళ్లమని బలవంత పెట్టింది" అని జబాబు చెప్పేడు లక్ష్మణుడు.

"అదంతా మాయ సుమా ! ఇంతకు ఏమి ముప్పు మూడిందో ?" అనుకుంటూ ఇరువురు అన్నదమ్ములూ పర్ణ శాల చేరేరు.

సీత కనిపించలేదు. పాపం ! ఎలుగెత్తి ఏడ్చేడు శ్రీరా

ముడు. కన్నీరు కార్చేడు సుమిత్రా తనయుడు. ఇద్దరూ వెదుక నారంభించేరు.

జటాయువు ఎదురై లంకాధీశ్వరుడైన రావణుడు సీతను తీసుకువెళ్ళేడని తెలియజేసేడు. వానర చెలిమి చేకూరింది శ్రీరామునికి. లంకకు ఆంజనేయుని పంపించి సీత సమాచారం కనుక్కొని రమ్మన్నాడు శ్రీరాముడు.

లంకకు పోయిన ఆంజనేయుడు కొంత పరాభవింపబడ్డా, తిరిగి వచ్చి సీతనుగురించి రావణుని గురించి సవిస్తరంగా చెప్పేడు. లంకకు పోయేరు శ్రీరామ లక్ష్మణులు, వానర సమేతంగా.

• • •

"దేవీ! కాల మాసన్నమైంది! వానర సేనలు లంకా రాజ్యంపై కాలు మోపేయి. వారి వెనువెంటనే శ్రీరాముడుంటాడు. వాయునందనునికి నే చేసిన పరాభవం శ్రీరాముని కోపాన్ని రెచ్చగొట్టి ఉండవచ్చు. కాని ఆ శాంతమూర్తిలో ఇది చల్లారితే నా ప్రయత్నమంతా వృథా అవుతుంది. నా శాపవిముక్తానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను." అన్నాడు రావణుడు మండోదరితో.

"ప్రియా! ఇంకా ఈ ఆనందఘడియలకు తిలోదకము లేనా? ఆ సాధ్వి సీతామతల్లికి మనము చూపిన నిరాదరణ మనకూ, మన శ్రేయానికీ లోటు తెస్తుందేమో?"

"ఆమె మగనితో వనవాసదీక్ష బూనినదిగదా?

లేకున్న మనస్సులోకి భోగము నామెకు లభ్యము కాకపోవునా? ఇంకే మాట నే వింటాను."

"అయ్యో ! నాథా !"

"చింతించకు."

◆ ◆ ◆

"దశరథ నందనుడైన శ్రీరాముడు లంకపై కాలు మోప కారణమేమో ?"

"ఏమది ? దానవాధిపుడైన రావణుడేనా ?"

"ఔను, నేనే."

"నా సీత యేది ?"

"నావద్ద సురక్షితముగా నున్నది."

"తక్షణం నా కప్పగించాలి."

"నన్నోడించి తీసికెళ్ళు."

"ఎందుకొచ్చిన కయ్యా మిది ?"

"మీకు కయ్యమునకు గాక వియ్యమునకు వచ్చితి ననుకొంటివా? అదిగో నీ సీత! నీ సీతకూ నీకూ మధ్య నేను నిలబడుతున్నాను !"

"అయ్యో! అదేమి! నా సీత సురక్షితంగా ఉన్న దంటివే."

"ఔను. ఇంద్రియచాపల్యానికి లోబడి ఎవరేనా అపచారం చేసిపోతారేమో అని, ఆమె విరాగినిబోలె చేసి ఉంచేను. ఆమె మానానికి మర్యాదకు ఎంతమాత్రం లోటు రానియ్యలేదు.

"ఉదారములయిన నీతిపలుకులు పలుకుతున్నావు కదా ? కయ్యము లేకుండా సీతను విడువరాదూ ?"

"అదిమాత్రం వీలుపడదు. కావాలంటే నన్ను గెల్చి తీసుకుపోవాలి. లేకపోతే...

"లేకపోతే ?"

"సీతను నాకు విడువు."

"విడిస్తే ?"

"నా యిచ్చవచ్చిన రీతి నుపయోగించుకుంటాను !"

"యుద్ధానికి సిద్ధమేనా ?"

"ఓ !..."

◆ ◆ ◆

రామ రావణయుద్ధం జరిగింది చాలా ఘోరంగా. ఎందరెందరో వానరులూ రాక్షసులూ కూడా మడిసేరు. విభీషణుడు రాముని ప్రక్క చేరి కొన్ని మర్మాలు చెప్పేడు. రావణుడు వధింపబడ్డాడు. శ్రీరాముడు గెల్చేడు.

"నాథా!" అంటూ శ్రీరాముని కాళ్లమీద పడింది సీత. చలించలేదు. శ్రీరాముడు. తాను నిరపరాధ నని సీత రావణుడు తనకు జెప్పిన గాథంతా చెప్పింది. నమ్మలేదు శ్రీరాముడు. అగ్నిపరీక్ష కావా లన్నాడు. ఒప్పుకున్నది సీత.

సీత పావనచరిత అని వేనోళ్ల చాటేడు అగ్నిదేవుడు.

---

## ౬. 'తప్పునో? తాకునో? కుసుమధన్వుని ఏటులు....'

[నందనోద్యాన వనంలోకి విహారానికి వెళ్లేడు నారదుడు.
సమయం సాయంత్రం. పూర్ణిమ తిథి. సూర్యుడస్తమిస్తున్నాడు పడమట చూస్తే; చంద్రుడుదయిస్తున్నాడు తూర్పున చూస్తే. వసంతఋతువది. పూచెట్లన్నీ పూచి ఎంతో రమణీయమైన వింత కాంతుల్ని, మధుర వాసనల్ని వెదజల్లుతున్నాయి. ఆ ప్రకృతి రమణీయ శోభ చూస్తున్నా ఆనందించక పోడు. ఆనందంతో ఇటు అటు తిరుగుతున్నాడు నారదుడు. ఇంతలో]—

"నారదా! నారదా!"

"ఇది పరిచిత కంఠం కాదే. ఎవరో బాలకుల్లో అబలల్లో అయివుండాలి. మళ్లీ పలవనీ, పోయి చూడవచ్చు." అనుకున్నాడు నారదుడు.

"నారదా!"

"మళ్లీ పిలుస్తున్నారే! నిర్మానుష్యమైన ఈ వనంలో పరియాచకానికి పిలిచినట్లు ఎవరు చెవుమా ఇలా పలుస్తున్నారు!" అంటూ అన్ని దిక్కులా పరికించి చూచేడు నారదుడు.

పొదల చాటున దాగున్న మన్మథుడు కొంచెం కనిపిస్తూ "ఓయీ! బ్రహ్మతనయా!" అని మళ్లీ కేకవేసేడు.

"ఏమి తండ్రీ, ఇటొచ్చేవు?"

"మునిపుంగవులకు నమస్కారము."

"మనోవాంఛా ఫలసిద్ధిరస్తు!"

"మన్మథ పుంటి కుసుమబుద్ధికొద్దీ అలా పలిచేను. క్షమించాలి."

"బాలకులు ఆనందపిపాసకులు. వారి క్రీడలు క్షమింపదగినవి కావు. ఆనందింపదగినవి. ఈ వసంత దినాలలో నీ కీర్తి కెక్కుడిది మన్మథా?"

"ఇక్షుఖండము ఎండిపోయింది. పూవులు వాడిపోయినాయి. వాటి వాడిక మీరు చెప్పినట్లు ఎక్కువగానే ఉంది. కాబట్టి వాటి పునస్సాధనకి వచ్చేను. ఈ పంచబాణాలు లేకపోతే నాకు నిరుద్యోగమే కదూ."

"సరే. నే వెళ్ళనా యింక?"

"భక్తాగ్రేసర చక్రవర్తులకు నమస్కారము!"

◆ ◆ ◆

"ఇంతదనుక రమణీయమైనా ఆననపూర్వమైన ఈ పుష్పవాటికములు నన్ను వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్నాయే! తెల్ల చల్లని కాంతితో ఆనందాన్ని వెదచల్లే చంద్రబింబం ఆ తూర్పున సూర్యబింబంలాగ కనిపిస్తున్నదే! నా దేహము వింత పోకడలు పోయేటట్లుంది. ఇంతలో యీ మార్పుకి కారణ మేమిటో? నవనాళ్లూ విశ్రాంతి కోరుతున్నాయి. విశ్రాంతే కాదు, ఏదో క్రొత్త కోరిక రేకెత్తుతున్నది మనస్సులో. ఇదంతా నా మనోదౌర్బల్యమా? ఈ పూలగుత్తి తగిలితే నా ఒళ్లు పులకరిస్తున్నదే! ఆఁ—ఏమి టీ వాంఛ! లలనాలాలిత్యకౌశలం కోరుతూవుందే యీ తనువు! నా చేతులు మనస్సు నామీద

తిరుగుబాటు చేస్తున్నట్లున్నాయి. ఎప్పుడూ లేని ఈ వాంఛ నా కేమిటి? మనస్సు కుదుటపడడానికి ప్రార్థనేనా చేసుకుంటాను. (కొంతసేపే సైనికులా) మనసిమినామే పోయింది. ఇంక నా కేమి గతి? ఆ!— ఆలోచనము వచ్చింది. ఇదంతా ఆ కుసుమునికి మన్మథుని చేష్ట అయివుండవచ్చు. పోయి, వాణ్ణి ప్రశ్నించి చూస్తాను.

♦ ♦ ♦

"మన్మథా! మన్మథా;"

"త్రిలోకసంచారీ! నేను మీ పిలుపుచేత పావనమయ్యేను! నమస్కారము."

"ఈ నక్క-వినయాలింక కట్టిపెట్టు!"

"తమ రాగ్రహించినట్లు కనిపిస్తున్నది."

"నా మనోవికారానికి నువ్వేనా కారణం?"

"నిస్సంశయంగా నేనే"

"ఇదా నీ పని?"

"తమ ఆశీర్వాదబలము!"

"అటు నెల్లాళ్ళు నాము చేసి మూలనున్న ముసిలమ్మను పొడిచినట్లు నా మీదా నీ శరపరంపర ప్రయోగము?"

"ఇన్నాళ్లూ ఏ నూతన మిథునంమీదనో ప్రయోగిస్తే నా అమ్ముల ప్రతిభ, వారి సహజానందం, భేదించి చూడలేక పోయేను. మీ మీద ప్రయోగిస్తే క్రొత్త ఆనందం కలిగింది."

"బాగుంది; నీ మీద నే ప్రయోగించి చూచుకొనలేక పోయావ్రా?"

"ఏమైనా దేవర్షులు! మంచి ప్రాహే మీది కాని

స్వప్రయోగము చేతకాక యిలా చేసేను."

"నీ బాణాలు ఉపసంహరించు. నా యీ మనోవైకల్యం మాన్పు."

"అ దెంతలో మాట!"

"నారాయణ! నారాయణ! ఇప్పటికి కొంత శాంతి కలిగింది యీ శరీరానికి. మన్మధా! నీ శరసంధానంలో ఏదో మహత్తున్నట్టుంది! ఏమి వేదన పడిపోయే ననుకున్నావు! ఆ పరమాత్మకే తెలియాలి! ఎంతటి మహాస్త్రమైనా దీనికి తీసికట్టే సుమా! నీ దృష్టి రణరంగంలో పోరు సల్పుతున్న సైనిక దళాలపైని వెళ్లిందంటే యుద్ధం క్రొత్తపోకడలు పోతుంది. ఏ నవ్యాయుధపరికరాలు కూడా దీనిముందర పనికి రావు సుమా! ఈ బాధ ఉత్తరక్షణంలో ప్రేయసిని కలుసుకుంటే ఆనందంగా మారుతుంది కదూ? ఆహా! ఏమి మాయ మన్మధా!"

"ఆ బాధ ఆనందంగా మారకపోతే నా యీ జీవితం వృధా."

"నువ్వు ధన్యజీవివి! ఎందరి హృదయాలలో యీ అమృతం పోసి ఆనందడోలికలలో ఉఱ్ఱూత లూగిస్తున్నావో!"

"మీరు పొగుడుతారే కాని నే నలా స్వతహా అనుభవించలేకుండా ఉన్నాను."

"కేవలం నీ పాపమే అనుకోవాలి."

"మహానుభావా! ఈ చాపం మీరు పుచ్చుకుని నా మీద ప్రయోగించరేనో?"

"అందులో నీవు పోసే జీవం ఎలా గొస్తుంది? కాని నీ ఆలోచన చాలా బాగుంది! నే నొక చిన్న సలహా చెబుతాను. మొదట నీ తేజం ఆ చాపంలోని కెక్కించు. తరువాత ఆ చాపం నా చేతి కియ్యి. కాని మహా బాధ పడిపోతావుసుమా! అందుకోను నడివయస్సులో వున్న కుర్రాడివి."

"అనుభవంకోసమే కదూ యీ తాపత్రయం."

♦ ♦ ♦

"బ్రహ్మతనయా! చాలు, చాలు! అనుభవనీయము! అనుభవనీయము! ఎంతటి వింతమార్పు! వెన్నెల వేడెక్కింది! మలయమారుతం ఉష్ణంగా ఉంది! ఈ పూలన్నీ పెరికి పైకి వెదజల్లుకోవాలని ఉంది! ఒడలు గగుర్పాటొందింది. కలయిక కోరుతున్నది మనస్సు. ప్రమత్తుడైన నా పైనే ప్రయోగిస్తే యీ విధంగా నుంది కదా! అప్రమత్తుల విషయం చెప్పేదేమిటి! నీ శరప్రయోగ మింక ఆపు నారదా!! అబ్బో! కుతూహలానికి ఎక్కువయి పోతున్నది! విశ్రమించితే తగ్గుతుందేమో? ఈ ప్రకృతి అంతటిపైనీ ద్వేషభావం పుట్టింది. ఇంకెక్కడికి పోదును? ఆ నారదునివద్దకే పోయి వేడుకుంటాను బాణాలు వెనక్కి లాగమని.

♦ ♦ ♦

"నారద మునీంద్రా! మీకు పదివేల నమస్కారాలు! దయచేసి చాలించి మీ బాణాలు వెనక్కి లాగుదురూ!"

"అనుభవమైందా! ఇందాక నా మీద ప్రయోగించి ఆనందించినట్టు లేదూ?"

"పరియాచకానికి వేళా ఇదీ?"

"కుఱ్ఱవాడివి నువ్వే యింత యిబ్బంది పడుతున్నావు కదా. వృద్ధుణ్ని నే నెంతి బాధపడుతున్నానో తెలుసు కున్నావా!"

"తెలియకేం? ఇక్కడ నా కొక ప్రణయిని భీత కురంగినేత్రి, నుత్తేభ కుంభ స్తని, సింహమధ్య దొరికితే మీ బాణాలు లక్ష్యాన్ని ఛేదించకపోవడమే కాకుండా మీ యిష్టాను సారం వర్తించియుందును!"

"అలాగునా? అటు చూడు మీ! దక్షపుత్రి రతీకన్య లా గుంది. నీ ఆటలు సాగుతాయేమో చూస్తావా?"

"సరే. సమయానికే వచ్చింది మహానుభావా! ప్రయ త్నించి చూస్తాను." అంటూ రతీకన్యను చేరుకున్నాడు మన్మథుడు.

♦ ♦ ♦

"మందగమనా! నీ పేరు?"

"రతి."

"కన్యవా?"

"ఔను."

"రతీకన్యా! నీకీ వెన్నెలలో, గాలిలో, ఆ పూలలో క్రొత్తదనం కనిపించలేదూ?"

"లేదు."

"పూరెక్కలు మీద జల్లుకోవాలనీ, నీటిలో మునక లాడుకుందామనీ..."

"నా కలాంటి వికార మేమీ లేదు. చూడగా నీ వెవ

డివో ఉన్మాదుడిలా గున్నావు."

"నే నున్మాదుడను కాను. మన్మథుణ్ని."

"ఏమిటీ? మన్మథుండివా?"

"ఆ. ఔను."

"అయితే యీ వెఱ్ఱేమిటి?"

"అరవిందాయతేక్షణ నేతీ! ఇది వెఱ్ఱా? కాదు, నిజం. చూసు, ఆ వెన్నెల వేడి, ఈ గాలిలో ఉష్ణం, ఆ పువ్వుల వికటాట్టహాసం, నా దేహంలో కొంత మార్పు కలిగించేయి."

"ఆ మతిభ్రమణమే నే వెఱ్ఱన్నాను."

"కంబుకంఠీ!"

"కంబుకంఠీ లేదు, గింబుకంఠీ లేదు. వెళ్లింక!"

"ప్రేమికులు ప్రథమంలో కలహంతో మొదలుపెడితే ప్రేమ పరిణామం అధికంగా ఉంటుం దంటారు. ఆ కలహాలని ప్రణయ కలహా లంటారు."

"తుంటరి. ఛీ, ఛో అనడానికి. నువ్వూ! నీ ప్రేమ స్తోత్రాలూను! నాకేం పనిలే కొచ్చే ననుకున్నావా!"

"మరాళగమనా! ఈ వాతావరణం నిజంగా చెప్పు, నీలో కొన్ని కోర్కెల్ని రేకెత్తించలేదా?"

"లేదు. లేదు. లేదు. ముమ్మాటికీ లేదు. నీ వింక పోతావా, లేదా?"

"నా ప్రార్థన వ్యర్థమేనా?"

"ఆహా."

♦ ♦ ♦

"దేవమునీ! నా బాధ యెక్కువయింది. తాళ లేనంతైంది! నా శ్రమ వృధా అయింది. ఇంతసేపు కష్టపడితే ఫలం దక్కుతుం దేమో అనుకున్నాను: పట్టి సందు గయింది. ఇంక విముక్తిన్ని చెయ్యండి.

"ఛా. అది వీరత్వము కాదు. భీరుత్వము!"

"మరి సహించలేను. ఏమి చేయమని సెలవు?"

"అలా గడుగు."

"త్వమేవ శరణాం! త్వమేవ శరణాం!"

"ఈ తూపులు రెండు రతీకన్యమీద వదుల్తాను."

"భళీ! ఈ వెఱ్ఱి దానికీ ఎత్తిస్తా రన్నమాట!"

"అప్పుడు నీ కష్టం ఫలించదూ?"

"ఎంతేనా దేవర్షులు!"

♦ ♦ ♦

"ఎంత పొరపా టెంత పొరపాటు చేసెను! మన్మథున్ని ఉన్మాదు డన్నాను. ఛీ, ఛో, అని తూలనాడేను. ఇప్పుడు మన్మథుడు చెప్పిన మాటలలో చాలామట్టుకు నిజ మున్నది. పాపం ఏ మనుకుంటున్నాడో! నా కిందుకా ఎందుకో తోచ లేదూ? పోనీ వెళ్లి వేడుకుందా మంటే ఎక్కడికో వెళ్లిపోయేడు. అతని ప్రశాంత పేశలమైన నగుమొగము శోకమయమైంది. అతని హృదయమణీ పేటికలో నున్న ఆనందమాలిక బైటపడిపోయింది. ఎంత నొచ్చుకున్నాడో? నాకూ వాట్లో

ఏదో యిదిగానే ఉంది. ఆ రమణీయమూర్తిదగ్గరకు పోతేనే బాగుంటుం దనిపిస్తున్నది. ఈ కోరిక యిందాకనే ఉంటే శ్రమే లేకపొయ్యేది. ఎంత విలపిస్తే నేమి లాభం? ఐనా నా మనోహరునికోసం వెదికి చూస్తాను."

♦ ♦ ♦

"మన తూపులు కొంత ఫలించినట్టున్నాయి మహా ప్రియా!"

"అదృష్టవంతుడి వన్నమాటే!"

♦ ♦ ♦

"మన్మధా! మనోహరా! అదిగో మన్మధుడు. నువ్వు చెప్పిందంతా నిజం సుమా! వాస్తవంగా ఆ వాతావరణంలో ఆ మార్పుంది! చూడు! ఆ తుమ్మెదల ఝంకారం ఎంత మనోహరంగా ఉందో! ఆ చెట్టుమీద నున్న చిలకా గోరింకలు మనకు ప్రణయపాఠాలు నేర్పుతున్నాయి. ఈ హరిణ మిధునం చేష్టలెంత సవ్యంగా ఉన్నాయి! ఈ వింత యిం చాకా కనిపెట్టలేకపోయేను! నన్ను క్షమించవూ!"

"క్షమించడాని కేముంది? నువ్వు పరిహాసమాడు తున్నావా? లేక నిజమే చెబుతున్నావా యిపుడు?"

"పరియాచకము కాదు ప్రియా! వాస్తవమే. నన్ను క్షమించు! నా దేహములో ప్రతి అవయవము నీ నీడ కోరు తున్నది. నువ్వు లేని యీ జగత్తు అంధకారమని నా మనస్సు బోధిస్తున్నది. నా దగ్గరగా నుండవూ? న న్నేలుకోవూ?"

"మునివరా! కొంచెము సెలవా..." "ప్రేయసీ!"

"ప్రియా!"

◆ ◆ ◆

„శరప్రయోగానికి పాత్రత ఉండాలి. ముక్కు-మూసుకున్న నా పైని ప్రయోగిస్తే నేమి లాభం? ధన్యజీవులు! ఆదర్శ ప్రేమికులు!"

◆ ◆ ◆

„అయ్యో! ఎంత వేళయిందో! మా తండ్రి నా కోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఈ ఆనంద క్షణాల్లో అసలు కార్యం మర్చిపోయేం. నే నింక వెళ్ళాలి మన్మథా! కాని నా కన్యాత్వం పోయిందే! ఇందుకు నా తండ్రి ఏం కోపం తెచ్చుకుంటాడో అని నాకు భయం వేస్తూంది."

„ఆ వెఱ్ఱిలో ఎంత పని చేసేం అన్నమాట! ఇం చేసిన తప్పు దిద్దుకోవడ మెలాగ? మన మిద్దరం నీ తండ్రిదగ్గిరకు పోయి క్షమాపణ కోరుకుందాము. ఆయన ఉదార పురుషుడు. క్షమిస్తాడు."

„బాగుంది ప్రియా! పద."

◆ ◆ ◆

„క్షంతవ్యాలం."

„ఎందు కంత తొందరపడ్డారు. శుభమస్తు!"

◆ ◆ ◆

„నారదా! నమస్కారం. ఉభయులమూ కృతజ్ఞులము."

„దంపతులు ఆనందపరవశులై మెలంగుదురు గాక! మఱి నా మీద దృష్టి పడనీయకుమా! చస్తాను."

„శివు డున్నాడు లెండి."

# ౭. 'నీవు నా భార్యవే: శృంగారం మాత్రం సున్న'

ప్రస్తుతము సమయం. వసంత ఋతువు. సమయు వనోపేతమైన కుంతి నందనవనం లాంటి ఉద్యానవనంలో ప్రకృతి శోభ ఆనందిస్తూ చెలులతో ఆడుకుంటున్నది.

„ఈ పుష్పచకములు ఆసవపూర్ణమై ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి!” అన్నది కుంతీకన్య.

„ఔను సఖీ! అధర సుధారస పూర్ణమైన నీ ముఖ పద్మముకూడా ఎంతో ఆకర్షణీయముగా ఉంది. వాటిని ధిక్కరిస్తున్నది కూడా.” అన్నది చెలికత్తె.

„నీ పరియాచకమున కేమిగాని ఆ పుష్పములు వేటినో ఆహ్వానిస్తున్నట్టున్నాయి కాదూ?”

„ఔను. మధువును గ్రోలు భ్రమరమును ఆహ్వానిస్తున్నాయి. లేకపోతే ఆ మధువు, అడవి గాచిన వెన్నెలలాగ నిరుపయోగ మవుతుంది.”

„నీవు సరిగా ఊహించేవు. అదిగో ఆ భ్రమరము ఎలాగు వస్తూవున్నదో!”

„మరి నీ అధరసుధ కూడా అట్లే కోరు భ్రమరము రావాలి.”

„అబ్బ! ఏమి మాటలే, చూడు! ఆ మధువు త్రాగి మత్తెక్కి, ఎంతో మధురగానం చేస్తూ వెళ్తూవుంది, ఆ భ్రమరం. మధు విచ్చిం దన్న మాట ఆనందం.”

,,మధువు ద్రాగితే మత్తెక్కదూ? కాని ఆ కుసుమము చూడు, తన కోర్కె యీడేరిందికదా అన్నట్టు కనిపిస్తున్నది.''

,,ఆ భ్రమరము మళ్ళీ యింకొకచోట మధువుకోసమే కాబోలు వాలింది.''

"ఎన్నెన్ని చోట్ల మధు వుంటే అన్నన్ని చోట్లా వాల్తుంది."

"భ్రమరమును పురుషులతోను పుష్పములను మగువలతోనూ పోలుస్తారట నిజమేనటే !"

"ఔను."

"అయితే ఈ భ్రమరము చర్య న్యాయమటే ?"

"ఆనంద పిపాసకులు న్యాయాన్యాయ విచక్షణ అంత సూక్ష్మంగా చేయరు. ఉదార హృదయులు వాటిని క్షమిస్తారు కూడా. అయినా, భ్రమరము మధువును గ్రోలుటలోనూ, భ్రమరిని కూడుటలోను అంత న్యాయపాలన అనవసర మను కుంటాను."

"ఈ న్యాయ మొక్క భ్రమరములకేనా, లేక మానవుల కూడానా ?"

"కామాతురాణాం నభయం నలజ్జా' అన్న వాక్యం చూస్తే మనకూ లేనట్టే వుంది. కాని సంఘ ఔన్నత్యంకోసం వెరుస్తారు."

"ఇప్పుడు మన కా కామశాస్త్రి తర్క మెందుకు. చూడు, ఈ చామంతి ఎంత మనోహరంగా ఉందో!"

"ఔను సఖి, ఆ చక్కని వర్ణం, సువాసన, ఎంతో

హాయిని చేకూరుస్తున్నాయి."

"ఆ అస్తమయ భానుడు తన స్వర్ణ కాంతులను దీని మీద బరపి స్వర్గానికి పరిమళము చేకూర్చాడు."

"ఔను. అస్తమయ భానుడు దీని శోభను ద్విగుణీకృతం చేసేడు."

"అకాలమైనా 'పయోధరచ్యుతి' దీనికి ఎంతో తోడ్పడుతుంది సుమా!"

"కాని అకాల 'పయోధరచ్యుతి' హానికరంకూడా."

"సంధ్యావేళ మన మిచ్చట నుండరాదు. ఇంటికి మరలుదమా?"

"మరలుదము. కాని ఆ రవిశోభ నన్ను ముగ్ధురాలిని చేస్తున్నది."

"నిన్నే కాదు, ఎవరినేనా చేస్తుంది."

"చెలీ, నాలో వుండే వెఱ్ఱికోర్కె నీకు చెబుతాను. చులకన మాత్రము చేయకేం."

"అయ్యో, నిన్నా చులకన చేయటం!"

"ఆ కమలాప్తుని ఉదయ, అస్తమయ వేళల చూచినప్పుడు నాకు అట్లాంటి తనయుడు కావాలనిపిస్తుంది."

"అలాగునైతే ఆ సూర్యుణ్ణి వివాహమాడరాదూ?"

"అందుకే చులకన చేయవద్దన్నాను, అతడు మనవాంట్లకు లభ్యుడటే?"

"కొందరు సంకల్పసిద్ధు లుంటారుకదా !"

"నేను మర్త్యకాంతను. అతడా లోకసాక్షి. నన్ను వివాహమాడతాడా ?"

"అది నీ అదృష్టము."

"చాలా తడ వయింది."

♦ ♦ ♦

"ఈ కుంతి ఆననము శుక్లపక్ష చంద్రబింబమువలె దిన దిన ప్రవర్ధమాన మవుతున్నది. ఆ ఉన్నత వక్షస్థలం, ఆ నులి కౌనును వ్రేగదీస్తుందేమో? ఆ లలనా లలామ లావణ్యం చక్కని సొగసులచేత రెట్టింపబడ్డది. ఆ చపలాక్షి చక్షువులు భీత మృగి నేత్రాల నోడగొడతాయి. ఆ నీలవేణి వేణీభరము సుమేరువా యట్లు అన్న భ్రాంతిని కొలుపుతున్నాయి. ఆమె నడకలు హంసను సిగ్గుజేస్తున్నాయి. ఆ అన్నుమిన్న మన్మథ ప్రేమ మాధుర్యాల మన్నట్లు కనిపిస్తున్నది. ఆమెను గవయు భాగ్య మబ్బు భాగ్యశాలి ఎవరో కదా? ఎవరో అనుకోనుటేల, నే నేల ప్రయత్నింపకూడదు?

మర్త్యకాంతకొఱకు ప్రయత్నించుటా ?

హాస్యాస్పదమే; కాని నా కోర్కె ఎక్కువగా ఉన్నదే. పోయి ప్రణయభిక్ష వేడుతాను.

వేడితే యిచ్చగించునా ?

ఒప్పుకోక ఏమి చేస్తుంది. అబల ఏకాంతముగా నున్న

ప్పాను ప్రయత్నిస్తాను. సమ్మతినో, అసమ్మతినో నా కోర్కెను తీర్చుకొని వస్తాను. ఈ రాత్రే ఆమె మందిరానికి పోతాను." అనుకున్నాడు అస్తమిస్తున్న సూర్యుడు, కుంతీదేవిని చూచి పరవశుడై.

"ఈ అర్ధరాత్రసమయాన ఎవరిదో అడుగుల సవ్వడి వినవస్తున్నది. నా చెలికత్తెల నందరినీ ఇక్కడినుండి పంపివేసితినే. ఆ చప్పుడు పురుష పాదములదై ఉండవచ్చు. ఇట్టి సమయాన పురుషు లెవరైనా యిచటికి రావడానికి కారణం లేదే! అదిగో యింకా దగ్గరగా వినిపిస్తున్నాయి. నా చెలుల కోసం కేకపెట్టనా?" అనుకుంటున్నది కుంతి అడుగుల చప్పుడు వినిపించగా.

"ఇంతుల మేల్బంతీ! కుంతీ!" అని సంబోధించేడు సూర్యుడు.

"ఈ కంఠము నిశ్చయముగా పురుషులదే. ఆఁ! ఎవ్వరీ మహాతేజస్వి! ఈతని ముఖంలో వశీకరణమంత్రం ఉన్నట్టున్నది. నేను ప్రతిదినము చూచే బాలభాస్కరుని పోలిక లీతనిలో ఉన్నాయి.

ఆహా ! ఎంతటి అందకాడు !

అందకాడై ఉండవచ్చు. కాని ఈ రాత్రి సమయాన ఆడవారి అంతఃపురానికి రావచ్చునా? వెడలగొట్టాలి. మాటాడ నో రాడకున్నదే!" అనుకుంటున్నది తనలో కుంతి.

"అంగనామణీ !" అని పిలిచేడు సూర్యుడు.

"ఆర్యా ! తమరు – తమ రిచ్చట కూర్చొండి."

"మర్యాదల మాటకేమి..."

"తమ నామధేయము ?"

"నీ వూహింపనే లేదా ?"

"............"

"ఎవని రేఖలు మేలు వానవ గల చామంతిని మిసిమి ఛాయలచేత మెరిపింపజేశాయని నీవు వర్ణించావో ఆ దీనుడ్ని."

"లోకసాక్షివైన భాస్కరుడవా ?"

"ఔను."

"తమ రాకకు కారణం."

"అర్థినై వచ్చేను."

"తమరా అర్థించుట-నన్ను !"

"అర్థించుట దోషము కాదుకద !"

"అర్థించు సమయము అర్ధరాత్రియా ?"

"అర్ధరాత్రి అర్థించునవియు ఉండును కదా ?"

"పరపురుషులకు అబలలను ఏకాంతముగా అడగవలసినవి ఉన్నవా ?"

"యౌవనవతివి, అంతమాత్ర మూహించుకొనలేవా?"

"మీ మాటల్లో ఏదో ద్వంద్వార్థ మున్నట్టుంది."

"నేను ద్వంద్వార్థానికి తా వీయలేను. నీ ప్రేమభిక్ష వేడుతున్నాను."

"మీ బోం ట్టిట్టాడ తగునా?"

"కోరి వచ్చిన, కులము తక్కువైనది కాబోలు!"

"నేను సుక్షత్రియ కాంతను. అవివాహితను. ఉత్తమ వంశమునందు పుట్టిన ఆడపడుచును. తమకు నాపై అంత అనురాగమున్న, నా తలిదండ్రుల కెఱుకచేస్తే వివాహం చేస్తారు. అంతే కాని అన్యథా నన్ను యిక్కట్లు పెట్టకండి."

"ఓహో! నీతులు బోధించుతున్నావే?"

"పరమపూజ్యులైన మీకు నేనా నీతులు చెప్పడం? నన్ను మాత్రం అవినీతిపాల్జేయకండి."

"అనవసర సంభాషణతో కాలము వ్యయపరుస్తున్నావు. నేను తాళలేనని తెలియపరుస్తున్నాను. నీ విచ్ఛగించినను లేకున్నను నే వచ్చిన కార్యం నెరవేర్చుకొని పోతాను."

"అయ్యో! బలాత్కారమా!"

"సాత్త్వికంగా వినకుంటే—"

"చెలీ! చెలీ!"

"ఇక మాటాడవలదు" అంటూ తన బలిష్ఠమైన బాహువులలో ఆమెను బంధించివేసేను సూర్యుడు. నోరు విప్పకుండా తన పెదవులతో అదిమి పట్టుకున్నాడు. అటుగా గింజుకున్నది కుంతి, ఆ చేతుల్లోంచి బయటపడదామని. 'నీవు చేస్తున్నది అన్యాయము సుమా' అని కండ్లతో తెలియ చేసింది. కాని విడిపించుకో లేకపోయింది. ఆ పర పురుష

స్పర్శ ఆమె యౌవనపు అంగాలకు తగలగానే ఆమెను కొంత లొంగదీసింది.

ఒకవిధమైన సుఖమయ బాధ పడింది కుంతి.

ఇబ్బంది పెట్టేడే కాని ఆ సూర్యునికికూడా మనస్సులో బాధ ఎక్కువయింది. తాను చేసింది తప్పనుకున్నాడు. కుంతిని పిలిచేడు. "కుంతీ! గతజల సేతుబంధనం మాని, భవిష్యత్తాలోచించు. నీవు గర్భము ధరిస్తావేమో? భ్రూణహత్యమాత్రం చేయకు. ప్రసవానంతరం ఆ పసికందును గంగలో విడువు. నేను పైనుంచి కాపాడుకుంటాను. మన ఈ యేకాంత శృంగారచేష్ట ఎవరితోను చెప్పను. నీవును రహస్యముగా ఉంచు. కాని నీ శరీరస్థితి నీ భర్తకి తెలియగిస్తుందేమో! ఈ ఓషధి సేవిస్తే అట్టి భయం వుండదు" అన్నాడు కుంతితో సూర్యుడు.

"కామాతురులు! ఇంతేనా మీ ధైర్యం? వలదని వారిస్తూవుంటే వినకుండా, అవసరం తీరాక తరువాత భీరువులాగున మాట్లాడుతున్నారే? మగవారు లింతటి స్వార్థపరులా? ఇంతటి మోసకారులా? వెళ్లండి. కాని యిందు పుట్టిన బిడ్డను జాగ్రత్తగా కాపాడండి" అంటూ వెడలగొట్టింది సూర్యుని కుంతి.

◆ ◆ ◆

"చెలీ! గడచిన రేయి భాస్కరుడు నన్ను బలాత్కరించేడు. నాకు గర్భచిహ్నాలుకూడా కనిపిస్తున్నాయి. శీఘ్రము సుఖప్రసవ మయేటట్టుంది. ఆ బిడ్డను నీవు తీసుకపోయి, ఒక

పేటికలో నుంచి, గంగలో విడవాలి. నా రహస్యం నీవు దాచి వుంచాలి" అంటూ గడచిన రాత్రి సంగతులు విశదపరచు కుంది కుంతి.

◆ ◆ ◆

కొన్ని దినాలు గడిచేయి.

పాండురాజున కిచ్చి వివాహం చేసేడు ముహూర్తం కుమా ర్తెను కుంతిభోజుడు. కన్నులపండువుగా జరిగింది వివాహం.

చిత్రాతిచిత్రంగా సిద్ధహస్తులచేత అలంకరింపబడ్డ శయనాగారంలో చేరేరు నూతన దంపతులు.

"నేను శృంగార సుధాసముద్ర సంపూర్ణ చంద్రోదయ మయినట్లుంది!" అన్నాడు పాండురాజు.

"తామిరు కామసామ్రాజ్య ధురంధరులు కాబట్టి" అం టూ జవాబు పలికింది కుంతి.

కన్యా సహజమైన సిగ్గులేమి పాండురాజు గమనించేడు.

"కలకంఠకంఠీ, నీ కంఠస్వరము కోయిలను ధిక్క రిస్తున్నది."

"తమరు రారాజులే కాక కవిరాజులుకూడా."

"నీ చూపులు మన్మథ తూపులు సుమా!"

"రతీపతి యెదురుగా వుంటే వాని తూపులు వాని వద్దకు పోవా?"

"నీ మందహాసము స్థాణువును కరిగిస్తుంది."

"చంద్రోదయమున కలువలు విడవా!"

"నిన్ను అందాల దొంతిగా చెయ్యాలని ఆ బ్రహ్మ పడ్డ

క్రమముగ నీ సడుమును సాక్ష్య మిస్తున్నది."

"ఆశ్రితరక్షుని నేను అభయమిస్తా నన్నట్లు' చాటు తున్నది మీ విశాల వక్షస్థలం.''

"దేవీ. పాపం ఆ భ్రమరం చూడు! పుష్పచకము లోని మధువు త్రాగి మత్తెక్కి సూర్యుని అస్తమయము తెలి యక అందులో చిక్కుకొని ఎంత మధురగానం చేస్తుందో!"

"అధరసుధకూడా మధువుతో సమానమకే!"

"ఔను ప్రేయసీ. నీ అధరసుధను గ్రోలినతరువాత నాకును అట్లే మత్తెక్కుతుందేమో!"

"మీరుకూడా రాల్గరగించు మధుర గానం చేస్తా రేమో!"

"ఆ భ్రమరమట్లే నేనూ నీ బాహువులలో చిక్కి ఉదయభాస్కరుని కరుణాకటాక్ష వీక్షణములు మనపై పడ దాకా వుండాలని వుంది కాబోలు!"

"అదెంతమాత్రము కాదు. మీ స్వేచ్ఛే నా కానం దము."

"నీ ప్రేమపాశంలో చిక్కుకొనే ఉండాలని ఉంది నాకు."

"ఎంతేనా పురుషులు మాటకారులు."

"నీకు పురుషజాతిపై యీ ద్వేషభావ మెందుకు కలిగింది?''

"అది ద్వేషం కాదు; యథార్థవచనం.''

"నీవు బాలభాస్కరునిగురించి మాట్లాడితే చకితు

రాలి వయేవు. పురుషుల్ని ద్వేషిస్తున్నావు. యదార్థవచన మంటున్నావు. ఎంతటి యదార్థవచనమైనా స్వానుభవము కాక నొక్కి వక్కాణించ వెరుస్తారు."

"......" కంటనీరు గిరగిర తిరిగింది కుంతికి. నోట మాట రాకున్నది. అనృతం పలుకలేకుండా ఉంది. సత్యం దాచలేకుండా ఉంది. నిజమే చెపితే దాంపత్యానికి నీళ్ళు ధారేమో. చెప్పకుంటే తీరని అనుమానం మగనికి. ఈ సందిగ్ధావస్థలో ఉన్నది కుంతి.

"కుంతీ, నీకు పురుషజాతిపై కలిగిన ద్వేషానికి కారణం చెప్పు. నీ కెవరేనా అపచారం చేస్తే దానికి తగిన ప్రతీకారం చేస్తాను." అంటూ కామశాస్త్రపారంగతుడైన పాండురాజు కుంతికి దగ్గరగా చేరేడు. కుంతివైఖరిలో ఏదో కనిపెట్టేడు. ఒక పెద్ద నిట్టూర్పు విడిచిపెట్టేడు. ముఖం తిరిగింది. చిరుచెమట పోసింది. ఇంత ద్రాఘిమానవం ఆాగేడు.

"కుంతీ" అని పిలిచేడు.

"నీకు జరిగిన అత్యాచారం నే నూహించుకో గలిగేను. నీ నోటంట నీవింక చెప్ప నవసరము లేదు. కాని ఒక్కమాట :

నేను ని న్నేలుకోను.

అంతమాత్రాన నిన్ను విడిచేసి సంఘంలో నగుబాట్ల పాలు చేయను. మన మధ్య శృంగారము సున్న. కాని నీవు నా భార్యవే."

పాదాలపైబడి యేడ్చింది కుంతి. జరిగింది సవిస్తరంగా

ఎరిగించింది కుంతి. నన్ను క్షమించుమన్నది.

కంటికి మింటికి యేకధార ఐంది పాండురాజు కూడా.

"దేవీ, నిర్మాల్యము కుసుమం తల దాల్చవలసిందే. వాసన చూడరాదు."

"దేవా, క్షమించరా!"

"నన్నేమి చేయమంటావు. ఉచ్ఛిష్టమా నన్ను ఆరగించమంటావ్?"

"భగవదార్పణ మాత్రమే జరిగింది. ప్రసాదమని భావించి మన్నించండి."

"నా మన స్సిచ్ఛగింపదు."

"ఇక నే జీవించి ఫలము లేదు."

"నేను నిన్ను విడనాడను; కూటమిమాత్రమే లేదంటిని."

"శృంగారము, సంతానము లేని బ్రతుకేల."

"నియోగ మున్నది కదా."

"పతి సజీవిగా నున్నప్పుడా?"

"పతి సమ్మతిని పనికివస్తుంది."

"కాని, మీ సంగతి?"

"ఏదో శాపకారణము లోకానికి సాకు చెప్పవచ్చు."

# ౮. భ్రాతృహత్య చేసిన భక్తాగ్రేసరుడు!

లంకాధీశుడైన రావణుని తమ్ముడు విభీషణుడు తల్లి కైకసి మందిరానికి వెళ్లేడు, దశకంఠుడు మైథిలిని ఎత్తుకొచ్చిన మరునాటి ఉదయాన. ఆ నడకలో మనస్సులోని తొందరపాటు ద్యోతక మౌతున్నది.

"అమ్మా! అమ్మా!" అని పిలిచేడు తల్లిని.

"ఏం తండ్రీ, విభీషణా! ఏం, ఇంత ఉదయాన్నే కబురేనా పెట్టకుండా వచ్చేవు? ప్రమాదమేమీ లేదు కద. నీ భార్యాబిడ్డలకు సౌఖ్యమే కదా" అంటూ ఆత్రుతతో ప్రశ్నించింది తల్లి.

"నా భార్యాబిడ్డల కందఱకు క్షేమమే కాని, మన కుటుంబాని కంతటికీ మన యావద్రాజ్యానికీ ముప్పు మూడుతుందేమో అని భయం వేస్తున్నది. అందుకే యిలా వచ్చేను."

"తనయా, అవి భీరుని పలుకులు. నీవంటి శూరుని నోట వినరానివి. ఐనా నువ్వు అకారణంగా అలాగ అనవు. సవిస్తరంగా కారణం నాకెఱింగించు. వీలైతే ఆపద తప్పించడానికి శాయశక్తులా ప్రయత్నించి చూస్తాను."

"ప్రయత్నించాలి. అందులో మనం సఫలీకృతులం కావాలి. లేకపోతే..."

"విషయమేమిటో చెప్పు, కుమారా."

"మా అన్నగారు..."

"ఆఁ. ఏమి చేసేడు మీ అన్న. దేవతలపై దండెత్త నిశ్చయించుకున్నాడా, లేక..."

"సమర మంటే నాకూ సంతోషమే. వెనుదీయను. కాని ఇప్పుడు తలపెట్టినది సమరము కాదు."

"దేవాసురయుద్ధం కాకుంటే ఇక దేనిగురించీ విచారించవలసిన అవసరమే లేదే."

"లేకేమి. మీ రీ దినం అశోకవనంలోకి పోయేరా?"

"లేదు. ప్రతి దినమూ పోతూనేవుంటాంకదా. అందులో విశేష మేముంది?"

"విశేషమా, చాలా వుంది. అక్కడ మన పాలిటి భాగ్యదేవతో, మృత్యుదేవతో తాండవం చేస్తూంది."

"నీ పలుకులు నా కర్థ మవడం లేదు."

"మా అన్నగారు అక్కడ ఒకఆమెను చెరనుంచేరు."

"ఎందుకో."

"కాంతలను చెరనుంచటం ఎందుకూ?"

"ఆమె ఎవరో తెలుసుకున్నావా?"

"లేదు. నే నామె దగ్గరకే పోలేదు: కాని చూచినంత మాత్రాన ఎవరో మహాత్మురాలివలె కనిపిస్తున్నది. మంచి రూపసి కూడా."

"అంతటి అందకత్తెయా?"

"నే నంత సూక్ష్మపరీక్ష చేయలేదు కాని అర్థనిమీలిత నేత్రయైయుయ్యా ఆమె నేత్రాలు అగ్నిజ్వాలల కాలవాలమైన త్రినేత్రుని ఫాలనేత్రమును ధిక్కరిస్తున్నాయి. ఆమె

ముఖము సహస్ర భాను తేజోవంతమై విలసిల్లుతున్నది. ఆమె దైన్యస్థితి రెచ్చగొట్టిన భావనాపరంపరలు ముఖములో ద్యోతక మవుతున్నాయి. సర్వాంగ సుందరమైన ఆమె దేహము ప్రకృతి దత్తమైన కొప్పుతో కప్పుకున్నది. ఆమె కోపిస్తే మనకు ప్రాణాంతక మవుతుంది. ఆమె కరుణిస్తే మనపాలిటి భాగ్యదేవతే."

"నీ వర్ణన ఆమెను చూడాలని అభిలాష నాలో పుట్టించింది. నీ అన్నకు కబురంపి సవిస్తరంగా కనుక్కుంటాను."

"కనుక్కున్నంత మాత్రంతో విడవడానికి వీలుపడదు. మీరు వారిని ఆ ప్రయత్నమునుండి మరలించాలి."

"అయితే యిప్పుడే కబురంపుతాను. నీవుకూడా నా దగ్గర ఉండు. మన మిద్దరము కలిసి ప్రయత్నిద్దాము."

"అలాగునే తల్లీ."

◆ ◆ ◆

"తల్లీ. నమస్కారము." అన్నాడు రావణుడు తల్లి మందిరానికి వచ్చి.

"దీర్ఘాయుష్మాన్ భవ." అని ఆశీర్వదించింది తల్లి.

"నా కొఱకు కబురంపేరట. కారణం?"

"ఈ దినం చిరంజీవి విభీషణుడు అశోకవనంలోకి పోయేడట. ప్రాతఃకాలాన్నే..."

"ప్రతిదినం పోతూనేవుంటా డనుకుంటాను. అయినా అందులో విశేష మేముంది?

"అన్నా ! విశేషమునకు కొదువ లేదు. నేను కండ్లారా చూచేను."

"అదా విశేషం."

"అది చాలదా."

"మీరు పొరబడుతున్నారు."

"మేమా పొరబడ్డది ?"

"కుమారా రావణా, నీవు నేటివఱకు నా మాట త్రోసిపుచ్చలేదు. నేడుకూడా నామాట వింటావా? వింటానని వాగ్దానం చెయ్యాలి."

"తల్లీ, నీవు రాజమాతవు. మాతృదేవతవు. మీ మాట మీరి నే నేమి చేయగలను. నేను మీ కా అనుమానం కలగడమే నా పాప మనుకోవాలి."

"అన్నా, యీ తీపిమాటలతో పనిలేదు. మీరు చేయబోయే ఆ పాపకార్యంనుంచి విరమించాలి."

"విభీషణా, నీ వేదో దురభిప్రాయంలో పడ్డావు. ఒకొక్కప్పుడు మృగతృష్ణనూ తేటనీటినీ విభజించి చూడలేము సుమా."

"మాటలతో మోసపుచ్చుట విద్యావంతులకు ఒక కళ."

"నాపై నీకింత కోప కారణ మెమిటో తెలియ జెప్పు."

"ముంతేతికి కంకణము తొడిగికొన్న అందము చూచికొందుకు అద్దము కావాలా ? లెక్కలేనన్ని సంవత్సరాలు

ఘోరతపస్సు చేసి ప్రతినిత్యము నవకోటి లింగార్చన చేస్తూ, లయకారుడైన శివుని సాక్షాత్కారము పడసి, ఎన్నో అస్త్రి శస్త్రిము లుంచుకొని, ముల్లోకములు భళీ యనవలసిన బాహుబల ముంది. అబలలను చెఱబట్టుటకన్న హీనకార్య మున్నదా ?"

"చెఱ బట్టుట హీనమే."

"మీారు అశోకవనంలో వుంచిన సాధ్వీమతల్లిని చెఱ బట్టడానికి కాక పూజించడానికా?"

"ఇదా నీ అనుమానము? నీవు మాత్రము చక్కగా పసికట్టేవు. నేను పూజించడానికే ఉంచేను, చెరబట్టడానికి కాదు."

"నమ్మడానికి ఏ లుండవద్దూ ?"

"నేనామె నక్కడ విడవడమే చాలు నా బాహుబలం తెలిసినవా రెవ్వరూ ఆమెను బలాత్కరించరే ననుకోను. ఏ మంత్రము వల్లనో ఏ తంత్రము వల్లనో నా కట్టి తుచ్ఛపు అభిలాష వుంటే యీా పాటికి కృతకృత్యుడ్ని అయేవాడినే. ఆమె యెవ్వతో తెలియక నీ వలా గన్నావు."

"ఔను, నాకు తెలియదు. కాని మీారు పూజింప నుంటే ఆమె మనపాలిటి భాగ్యదేవతే."

"తల్లి, విభీషణా, మీా యిరువురూ కావ్తులు. మీా వద్ద నింక యీా రహస్యము కప్పివుచ్చలేను. అన్యులకు మాత్రము తెలియనీయవద్దు" అన్న రావణుని ముఖం గంభీరమైనట్టు కనిపించింది విభీషణునికీ, కైకసికీ కూడా.

"ఆమె జనక రాజర్షి తనయ. దశరథ తనయుడైన శ్రీరాముని భార్య. భావి అయోధ్యాధీశుని యిల్లాలు."

"అంత ఉత్తమ శ్రేణికి చెందిన యిల్లాలినా నీవు యిక్కట్లు పెడుతున్నావు."

"ఆమె ఉత్తమ శ్రేణికి చెందిన యిల్లాలు కాబట్టే తెచ్చేను. మన స్థూలదృష్టికి కనిపించే మానవ మగువ కాదామె. ధరాజాత. ఆదిలక్ష్మి, విష్ణువు ప్రియపత్ని."

"ఏమిటీ! శ్రీరాముని యిల్లా లంటివే."

"అవును. ఆ శ్రీమన్నారాయణుని అవతారమే శ్రీరాముడు."

"ఆమెను యీ విధంగా 'చెరలో' నుంచడం దావానలంలో దాగుడుమూత లాడుట కాదూ?"

"తల్లీ, మీకు నేను చెప్పాలా. మీరు ఇంకా మమకారములో మునిగిఉన్నారు. నేను, మా తమ్ముడు కుంభకర్ణుడు శాపబద్ధులమని మీకు తెలుసుకదా. ఇది మా కడసారి జన్మ. మా నియమిత ఘడియలు ఆసన్నమయ్యాయి. మీ ఆజ్ఞానుసారము నే చేసిన తపస్సుచేత నా మరణం నే కోరి తెచ్చుకోవలసి ఉంది. సెయ్యమున వీలు కానప్పుడు కయ్యమున నైనా ఆ శ్రీహరి చేతులలో నా ప్రాణాలు విడుద్దామని ఉంది. అందుచేత యీ నా ముక్తికాంతను చెరలో నుంచేను."

"నీ మారకురాలిని నీవు కోరి తెచ్చుకున్నావా?"

"తల్లీ, నాకు ఆ శ్రీహరి పాదాల దగ్గరకు పోవాలని ఉంది."

"నీ విప్పుడు ఆ శ్రీరామునితో పోరు సలిపితే ఎన్నెన్ని కష్టాలొస్తాయో, ఎందఱెందరు మరణిస్తారో, అన్నిటికి నీవు బాధ్యుడ వవుతావు."

"మరణించిన వా అందఱికి వీరస్వర్గ మొస్తుంది."

"కాని మన వంశం నాశన మవుతుంది. ఈ విశాల లంకారాజ్యం యింక అన్యుల పాలు కావలసిందేనా?"

"ప్రాణసర్వస్వమూ పోతూవుంటే రాజ్యం గురించి విచార మెందు కన్నా. అయినా..."

"ఏమిటి నీ వ్యూహం."

"విభీషణుడు శాపబద్ధుడు కాడు."

"కాక పోయిన?"

"ఆ శ్రీరాముని శరణు వేడితే ప్రాణాలు కాపాడి నన్నోడించి విభీషణునికి పట్టం కట్టవచ్చు."

"ఛీ. నన్నంత నీచునికింద, అంత అధమునికింద, అంత స్వార్థునికిందా లెక్కిస్తున్నారా. మీకు నా మీద వుండిన అభిప్రాయ మిదా? ఇంక నే జీవించి ప్రయోజనం లేదు. మన వంశం, మన రాజ్యం, మన మర్యాదకీ లోటువస్తుందని అనుమానించి నిష్కర్షగా మాటాడినందుకు యిదా ప్రతిఫలం. ఎదిరిని శరణు వేడమంటున్నారు. ఇంక సెల వియ్యండి, నే పోతాను."

"విభీషణా, ఎందు కా తొందరపాటు. నీ యువక రక్తపు వేడిలో విషయ సమాలోచన చేయలేకుండా ఉన్నావు. నీవును మాతో వుండి, రానున్న ఆ ఘోరసంగ్రామంలో పాలు

గాంటే పాతజీవుడవు కావలసిందే. మన వంశం నాశన మవుతుంది; మన యశశ్చంద్రికలు అడుగంటుతాయి. మనరాజ్యం అన్యుల పాలవుతుంది. కాబట్టి నా మాట మన్నించి నీ వా శ్రీరాముని శరణు వేడు..."

"అనుపమానమైన శౌర్యంతో శౌరి పోరికొస్తాడంటే దిగంత విఖ్యాతి వహించిన బాహుబలంతో నీ వెదుర్కొంటూ వుంటే నా చేతుల పండువుగా యుద్ధంచేసి పితృసమానుడైన పెద్దన్నకు తోడ్పడేది మాని, పిరికిపందలాగ వైరికి శరణు చొస్తే నన్ను లోకం ఏమంటుంది?"

"శ్రీహరి శరణు చొస్తే లోకం శ్లాఘిస్తుంది."

"ఎందుకు? రాజ్యద్రోహం, మాతృద్రోహం, భ్రాతృద్రోహం చేసినందుకా? లేక, నా బంధుకోటి, ఆరాధ్యురాలైన తల్లి, ప్రియసోదరులు, భృత్యులు, ప్రాణాలు పోయి వీరస్వర్గా న్నంటే నా మేను దాచుకొని కించిద్భోగానికై నీ అనంతరం ఈ శ్మశానవాటికలో తాండవించడానికా? ప్రతిక్షణం ఈ విషాదఘట్టాలు స్ఫురణకు తెచ్చే యీ భూమిని నే నెలా ఏలడం. నాకు మాత్రం హృదయం లేదూ?"

"విభీషణా, నీవు కొంచెం ఉదారదృష్టితో చూడు. నీకే బోధ పడుతుంది. అతని నీడ తగిలితే నీ హృదయం మారుతుంది. నీవు ధన్యుడ వవుతావు. లోకం మెచ్చుకుంటుంది. భక్తాగ్రేసరులలో లెక్కిస్తుంది. అన్యథా తలచక నా మాట మన్నించు."

"నా హృదయం మీ అందఱి మరణం చూచి విల

పిస్తూ ఉంటే నా నోరు శరణు శరణని ఎలా అంటుంది?”

“జ్ఞానోదయం కలిగిన తరువాత యీ మమకారం పోతుంది. భవిష్యత్తాలోచించాలి. నీవు స్థిరచిత్తుడవు కావాలి.”

“నా కింతమాత్రము నచ్చలేదు. కాని యిది మీ ఆజ్ఞగా పాలించమంటే ఎదురు తిరగను.”

“నీవు సజీవుడవై ఉండడమే కావాలి నాకు. ఇంకొక్క విషయమున్నది: నీ వందుకు కూడా సమ్మతించాలి. నా జీవ రహస్యం నీకు తెలుసును కదా?”

“జీవ రహస్యమా? ఏమి టది?”

“నా హృదయంలో అమృతకలశ మున్నది. అందుచేత యీ నా శిరస్సు లెన్నిమార్లు ఖండించినా పోవు. ఆ రహస్యం అవసరమైతే శ్రీరాముని కెఱిగించు.”

“నన్ను భ్రాతృహత్యా పాపం చెయ్యమని ప్రబోధిస్తున్నా రన్నమాట?”

“నీవు నాకు ముక్తికారకుడ వవుతున్నావు.”

“మీరు మాటలచేత నన్ను వంచిస్తున్నారు.”

“లేదు విభీషణా, నా మాటలు మన్నించు.”

“మన సహోదర సంఘీభావ జీవనం ఏ కొద్ది రోజులో అన్నమాట.”

“మీ యిరువురి సంభాషణ పూర్తిగా విన్నాను. నాకును ఆనందం కలుగుతూ వుంది. మనందఱకు ఒకేసారి పరలోకప్రాప్తి కలుగుతుంది. అదీ మంచిదే.” అంది తల్లి.

“ఒక్క యీ పాపికి తప్ప” అన్నాడు విభీషణుడు.

♦ ♦ ♦

జానకిని దశకంఠుడు ఎత్తుకురావడం విని హనుమంతుని పంపి, జాడలు కనుక్కొని, రావణునిపై దండెత్తి వచ్చేడు శ్రీరాముడు, సుగ్రీవ సేనా సమేతంగా.

సమరసన్నాహాలు యిరువైపులా తీవ్రంగా జరగడం వల్ల ఘోరాతి ఘోరంగా జరుగుతున్నది యుద్ధం. అతి నిపుణతతో సైన్యాధిపత్యం నిర్వహిస్తున్నాడు శ్రీరాముడు.

"శరణు, శరణు" అన్న పదాలు చెవిని పడ్డాయి.

రావణుని తమ్ముడు విభీషణుడు ఎదుట పడ్డాడు.

అభయహస్త మిచ్చేడు విభీషణునికి.

కాని——

"నీవు మీ అన్నను వదిలి వచ్చేవే! భ్రాతృద్రోహివి కావా?" అన్నాడు.

"శ్రీరామా! మాయామానుష వేషధారీ! నేను నీ జాడ తెలియక రాలేదు. నన్ను పరిశీలింప వేసిన ప్రశ్న అది. ఇహలోకజన్ము లందఱకు గమ్యస్థానం నీ పాదాబ్జములే కదా! అవి నాకు సజీవంగా నుండగనే లభించేయి. నిరుపేదకు పెన్నిధి. ఇంక విడువను." అన్నాడు చాలా మార్పు కలిగిన ముఖ వికాసంతో విభీషణుడు.

శ్రీరాముడు రావణుని ఎదుర్కొని పోరుతున్నాడు.

ఎంత ప్రయత్నించినా రావణుని చంపలేకుండా ఉన్నాడు. చాలా చాలా అస్త్రాలు ప్రయోగించేడు. కాని ప్రయోజనం లేకుండా ఉంది.

"శ్రీరామా! మా అన్నగారి హృదయంలో నున్న

అమృతకలశం మొదట చిల్లి పెట్టాలి.” అన్నాడు విభీషణుడు.

రహస్యం తెలిసిన శ్రీరాముడు బాణం ఎక్కుపెట్టి దశకంఠుని హృదయంలోకి కొట్టేడు.

ప్రాణాలు విడిచేడు రావణుడు. శ్రీరాముడు యుద్ధం గెలిచేడు:

“విభీషణా! నాకు చేసిన ఉపకారానికి నీకు లంకా రాజ్యాధిపత్యం చేస్తాను. రేపే పట్టాభిషేకం” అన్నాడు శ్రీరాముడు.

విషాద ఆనంద అశ్రువులతో ఒప్పుకున్నాడు విభీషణుడు. అత్యంత వైభవోపేతంగా జరిగింది పట్టాభిషేకం.

---

## ౯. తార గదిలో చంద్రుడు

“నాథా! ఈ దినం మీ శిష్యబృందములో చేరిన కొత్త బాలు డెవరు?”—అని ప్రశ్నించింది- దేవగురువైన ‘గురుని’, భార్య తార.

“దేవీ! అతడు అత్రిమహాముని తనయుడు చంద్రుడు” -అని బదులు చెప్పాడు గురుడు.

“ఆ విశాల ఫాలభాగం, ఆ నేత్రద్వయం...ఆ నాసాగ్రం, ఆ కుఱ్ఱని ముఖాని కెంతో అందము తెస్తున్నాయి నాథా!”

“అవును మంచి అందగాడే, స్ఫురద్రూపి!”

“తెలివి తేటల్లో, శాస్త్రజ్ఞానంలో మిమ్మల్ని మించు

తా డనిపిస్తున్నది నాకు.''

"అది భవిష్యత్తు గదా.''

"అల్లాంటి తనయుడు నాకు లభిస్తే...''

"నాకు మాత్ర మయిష్టమా?''

ఇంతకీ పుత్రప్రాప్తి ప్రాప్తానుగుణ్యాము కదా !''

"నా శిష్యు లందరూ నీకు పుత్రతుల్యులే గదా !''

"కాకేమి! కాని నాలో నున్న స్త్రీ సహజమైన మాతృత్వము నన్నీదినం బాధిస్తున్నది. అందు కలా అన్నాను.''

"నీకూ కొది కాలంలోనే పుత్రు డుద్భవిస్తాడులే.''

"నిజమా దేవా !''

"నిజమే''

"అంతవరకు ఈ చంద్రుణ్ణి నావద్ద వుంచుకుంటాను.''

"అందు కభ్యంతర మేమిటి?''

"మీారు నిజ తనయునివలె చూడాలి ఆ పిల్లాణ్ణి.''

"నీకు వానిపై ఎందుకో చాలా అభిమానం కలిగి నట్టుంది.''

"ఔను, దేవా ! వీలైతే అత్రిదంపతుల నడిగి మనకు దత్తత చేయుమనాలని కూడా వుంది.''

"వెఱ్ఱిదానా ! నీకు పుత్రు డుద్భవిస్తాడంటిని కదా ?''

"పుట్టవచ్చునుగానీ యింతటి అందాల కుప్ప...''

"అది నీ అదృష్టం.''

◆ ◆ ◆

"కుమారా శశీ ! దా ! యిటు రారా తండ్రీ !'' అని పిల్చింది—తార ఆడుకుంటూన్న చంద్రుణ్ణి.

"తల్లీ నమస్కారం!" అంటూ దగ్గరగా వచ్చాడు చంద్రుడు.

"తనయా! నీ తలిదండ్రు లెవరోయీ?"

"మా తండ్రి అత్రి, మా తల్లి అనసూయ."

"మరి నన్నేల 'తల్లీ' అని పిలిచేవు?"

"గురు పత్ని మాతృ తుల్య కదా!"

"మాతృతుల్యనే కాని మాతను కాను కదా!"

"ఐననూ ఆ సంబోధన నిషేధము కాదు కదా!"

"ఎంతమాత్రమూ కాదు. తండ్రీ, నీవు నన్ను 'తల్లీ' అని పిలుస్తే నాలో ఏవేవో రిక్త కోరికలు రేకెత్తేయి. అందు కలా ప్రశ్నించేను. ఈనాటినుండి నీవు నాకు పుత్రతుల్యుడవు కావు నా పుత్రుడివే. నన్నా విధంగానే పిల్చి, నా కను పండువుగా నా ముందరే ఆడుకుంటూవుండు. ఇది నీ స్వగృహం."

"నీ కరుణ అపార మయినది తల్లీ!"

♦ ♦ ♦

"నాకు తనయులు లేరన్న కొరత తీరింది. ముద్దులు మూటకట్టు చంద్రుడు నన్ను 'అమ్మా!' అని పిలుస్తే నా ఒడలు పరవశము చెందుతున్నది."-అంది ఆనంద రేఖ లుట్టిపడుతున్న ముఖంతో తార గురునితో.

"నీ కంత ఆనందంగా వుంటే నాకు మాత్రం ఆనందము కాదా?" అన్నాడు దేవగురువు.

♦ ♦ ♦

"చంద్రా! నీ కిచ్చట సౌఖ్యముగా వున్నదా?" అని

అడిగింది తార చంద్రుణ్ణి ఒకనాడు.

"అమ్మా! సౌఖ్యాని కేమి కొదవ? నవమాసములు గర్భవాసాన మోసి, స్తన్యమిచ్చి పెంచిన తల్లికన్నా అధికా దరణతో నా అవుసరం కనిపెట్టి పెంచుతున్నావు. యింతకన్నా కోరవల్సిం దేమిటి?"—అన్నాడు మాతృ భక్తి పుట్టిపడు తూన్న స్వరంతో చంద్రుడు.

"గురుకులవాస మన్నాళ్లూ స్వగృహవాసం విద్యార్థు లకు నిషేధిస్తారు, విద్య సాగదేమోనని. నా వాత్సల్యం నీ విద్యకు ఆటంకము కాదు గదా?"

"నీవు మాతవే కాక గురుపత్నివి కూడ కదా?"

"నీవు విద్యలో గురువుని మించిన మేటి వవుతావని ఆశిస్తున్నాను. నన్ను హతాశను చేయరాదు సుమా!"

"అమ్మా! శక్తి వంచన లేకుండా యత్నిస్తాను. తక్కిన శిష్యులందరికన్నను నాపై ఒజ్జలు ఎక్కువ ప్రేమ చూపిస్తు న్నారు కూడా"

"కుమారా! మీ తల్లిదండ్రుల యాజ్ఞ పుచ్చుకుని విద్యానంతరము మా యింటనే వుండిపోతావా?"

"అందుకు నా సమ్మతి మేమి విలువ? మీ యిష్టాను సారమే వర్తిస్తాను."

"విలువ కొరకు గాదు. నీకు సమ్మతమయితే మీ తల్లిదండ్రుల కెఱుక చేస్తాను."

"ఒజ్జల అనుజ్ఞ వద్దా?"

"మీ గురువులు నన్ను కాదనరు."

♦ ♦ ♦

"కుమారా, చంద్రా! నీకు షోడశ విద్యలు నేర్పేను. నీవున్నూ అసమాన మేధాశక్తి కనబర్చి నా ప్రియశిష్యులలో ప్రథముడవయ్యావు. యుక్తవయస్సు వచ్చింది. విద్య చాలించి తలిదండ్రుల వద్దకు పోయి వివాహితుడవయి సుఖముగా రాజ్యపాలన చేయాల్సిన కాలం సమీపించుతున్నది. యిన్నాళ్లూ నా తనయునిగా చూచుకొంటున్న నిన్ను విడనాడడం నాకూ నా భార్యకు కూడ చాలా కష్టం. కాని విధి నడ్డగలమా? ఇంకొక విషయం: నీవు వెళ్లవలసిన సమయము సమీపించినా నీ విచ్చట యింకొక రెండు మాసములు ఉండిపోవాలి.

నేను పత్రభంజనుడు చేసే యాగానికి పోయి రావలె. యింట తార ఒంటిపాటుగా వుంటుంది.

ఆమె ఒంటరిపాటు ఎరుగదు. కాబట్టి నేను వచ్చిందాక నీవుండి, పిదప పోదువుగాని—పాపం, నీవు నీ మాతాపితరులను చూడ నారాటపడుతున్నావు కాబోలు. ఇంతమాత్రముపకారం నాకు చేసిపెడతా వనుకుంటాను."—అని చంద్రునితో చెప్పాడు గురుడు.

"గురువర్యా! అత్యంత ఆదరాభిమానాలతో నాకు విద్య నేర్పి, మీ కుమారునికన్నా ఎక్కువగా ఆదరించి సర్వవిద్యల నన్ను ప్రవీణుడ్ని చేసిన మీకు నే నభ్యంతరము చెప్పడమా? అదీ మా తల్లిని మరపించే వాత్సల్యంతో పెంచి

నా తప్పులు మన్నించి, న న్నానందాబ్ధి నోలలాడించిన గురుపత్ని-మాతృతుల్యురాలైన తారాదేవికి సహాయము కావలసినప్పుడా? మీరు ఆజ్ఞాపింపకున్నా ఆమె నొంటరిపాటున విడిచిపోవ నా కాళ్ళాడుతవా?" అని బదులు పలికాడు చంద్రుడు.

◆ ◆ ◆

„దేవీ, నన్ను వ్రతభంజనుడు చేసే యాగానికి రమ్మని ఆహ్వానము వొచ్చింది. లోకకళ్యాణానికి చేసే ఆ యాగానికి వెళ్లక నాకు తప్పదు. నేను రేపే వెళ్లాలి. మరలి వచ్చేసరికి రెండు నెలలు కావచ్చును. అందాక మన చంద్రుణ్ణి నీ వద్ద నుండమన్నాను. నీకూ ప్రియుడేకదా చంద్రుడు." అని తన ప్రయాణాన్ని ఎరిగించేడు భార్యకు గురుడు.

„దేవా, లోకకళ్యాణార్థమై యాగము త్రిలోకాధిపతి చేస్తూ మిమ్మల్ని రమ్మని ఆహ్వానిస్తే అడ్డుచెప్పి పాపం ఒడిగట్టుకో గలనా? కాని, వలచి వివాహమాడిన మీరు ఒక్కనాడుకూడా నన్ను నేటివరకు ఏలుకో లేదు!" అన్నది తార.

„మనబోంట్లు శృంగారక్రీడల మునగరాదుగదా?"

„అట్లయిన వివాహ మేలకో?"

„కామేచ్ఛకూ వివాహమునకూ సంబంధము లేదు."

„సరి, ప్రయాణమునకు సంసిద్ధులైన మీతో ఇప్పుడీ తర్కమెందుకు."

„కులసతి ధర్మములు పాటిస్తూ ఆ నిత్యాగ్ని హోత్రాలకు భంగము రాకుండ జాగ్రత్తగా మెలగాలి."—అం

టూ ప్రయాణమైనాడు గురుడు.

◆ ◆ ◆

,,నేను పతి యింట లేను. నాలో పుట్టిన ఈ కోర్కె అసభ్యతగా లేదు. ఎన్నడూ నా దేహము నాపై ఇంత తిరుగుబాటు చేయలేదు. కాని ఈనాడు ఈ కోర్కె అణిచిపెట్టడానికి నాకు బలం చాలకుండా వుంది. ప్రకృతి కూడా నాకు క్రొత్తగా కనుపిస్తున్నది. అన్నింటికీ ఆ స్థితికారకుడున్నాడు గదా!'' అనుకుంటున్నది తార తనలో కామేచ్ఛ పుట్టగా.

,,తల్లీ!'' అని పిల్చాడు చంద్రుడు.

,,—'' (అదిరిపడింది తార.)

,,ఏమమ్మా అలా అదిరిపడ్డావు. రుగ్మతేమీ లేదు కద!''...అంటూ అదిరిపడ్డ తారను కొద్దిగా పట్టుకుని కూర్చోపెట్టాడు.

,,నా—కు—మా—రా!'' అంది తార.

,,అవును తల్లీ, నేనే, చంద్రుణ్ణి. ఇప్పుడు సుఖముగా నున్నదా?''

,,ఎంతో సుఖముగా నుంది.'' అన్న తార ముఖంలో మన్మథరేఖలు కనుపించేయి చంద్రుడికి. వెంటనే ,,తల్లీ!'' అంటూ విడిచి వెళ్లిపోయాడు. కాని మనస్సు కుదుటబడ లేదు.

,,ఛీ, ఎంతటి పాపపు చింత. ఆమె సౌందర్యవతి కావచ్చు. అంగసౌష్టవము కలిగి యుండవచ్చు. కాని నాకన్న వయసున పెద్ద. గురుపత్ని. తల్లి. వందనీయ. దేవగురువు

భార్య. ఆ చింతమాత్రానసే నేను స్వర్గానికి అనర్హుడ నౌతాను. అందునూ గురు వింట లేనప్పుడు గురుద్రోహం చేసి నా విద్య మంటగలపనా ?'' అనుకుంటూ ఇంటిముందు వసములో తిరుగాడబోయాడు చంద్రుడు.

♦ ♦ ♦

"చంద్రా !" అని పిలిచింది తార.

చంద్రు డగపడలేదు.

,,అయ్యో ! పాపం ! ఎక్కడికి పోయాడో ఈ రాత్రి వేళ. నాపై కోపగించలేదు కదా ? పుత్రతుల్యుడు, అభిమాన నీయుడు అయిన చంద్రుడు నే డేలకో కొత్తగా కనిపిస్తు న్నాడు. అతని సహజసౌందర్యము నేడు ద్విగుణీకృతంగా వున్నది. ఇంతలో ఇంత మార్పు కనిపించడం నా హృదయస్థితి అనుకుంటాను. నేను ఎంత ప్రయత్నించినా 'వాంఛ' ఎక్కు వవుతున్నదిగాని తగ్గుటలేదు.

ఇందాక చంద్రుడు నా భుజము లాని పట్టుకున్నప్పుడు అవ్యాజమైన ఆనందం కలిగింది నాకు. ఆనందం కాదు సుఖం! ఆ చంద్రుని స్పర్శ నాకు కొత్తది కాకపోయినా నేడు కొత్త నా వుంది.

అతనియందు నాకీ దృష్టి అసమంజసము.''అనుకుంటూ రెండు ఝాముల ప్రొద్దు అగుట నిద్దురపోయింది తార. కాని మూసిన కళ్లలో చంద్రుని ప్రతిబింబము చిక్కుకున్నది.

♦ ♦ ♦

చాలా రాత్రి అయింది కదా అని లోనికి వచ్చి పడుకున్నాడు చంద్రుడు. కన్నుమాత్రం మోరగించలేకుండా వున్నాడు. ఆ అగరువత్తుల సువాసన, సాంబ్రాణి పొగ, మలయమారుతం, కమ్మని పరిమళం చంద్రుణ్ని వున్మాదుణ్ని చేశాయి. ఎదురుగా వేరే గదిలో పడుకున్న తారాదేవి కనిపించింది. సౌందర్యోపాసకుడై అలా చూస్తున్నాడాయన.

మైకం కమ్మి ఇటునటు కొట్టుకుంటూన్న తార నోటంట 'చంద్రా' అని. అదే సమయాన 'తారా' అని చంద్రుని నోటంట వెలువడ్డాయి.

తార గదిలోకి వెళ్ళాడు చంద్రుడు.

మైకంలో కళ్లు తెరిచి చూచింది చంద్రుణ్ణి.

అప్రయత్నంగా 'ప్రియా!' అంది.

'ప్రణయినీ!' అన్నాడు చంద్రుడు.

"మానినీ మానస చోరా!"

"మనోహారీ!"

"పుష్పశరా!"

"గజగామినీ!"

"అబ్బ!—నీ స్పర్శ ఎంత సుఖంగా వుంది. నీ నఖాంకురములలో అమృతబిందువు లున్నట్లున్నాయి."

"నీ ముఖబింబములో అమృత కలశ వెలిసినట్టుంది."

"వుండుండు, నీకు ద్రాక్షారసము కొంచె మిస్తాను."

,,నీ అధర సుధారస ముంది కదూ!''

,,ఈ దిండు గల్లకింద పెట్టుకో!''

,,నీ ప్రణయ డోలికల పూగులాడుతూవుంటే మరి దిండ్లెందుకూ?''

,,ఆ దీప మారిపోతుందేమో చూచి వస్తాను.''

,,నా ప్రణయ జ్యోతి వెలుగుతున్నది కదా!''

,,ఈ గంధము కొస్త పూయనా?''

,,నీ లావణ్య సముద్రంలో ఈదులాడుతూవుంటే గంధ ముంటుందా?''

,,ఈ నీ మెత్తని చేతులతో నన్నలా బాధించు తున్నావు!''

,,నా దేహము అంతకన్న మృదువైనది కదా!''

,,పాపం అలసిపోతున్నావు!''

♦ ♦ ♦

ఆ మైకంలో ఎవరి పక్కలమీదకు వా రెప్పుడు వచ్చారో వారికే స్మృతి లేదు.

అరణోదయ వేళ నిద్రనుంచి లేచా రిద్దరూ.

♦ ♦ ♦

,,నా ఒంట్లో బడలికగా వుంది. ఆఁ! ఏమీా వింత, ఒక విధమైన మధురస్వప్నము గాంచినట్టున్నది. ఆఁ! స్వప్న మంతా జ్ఞాపక మొచ్చింది. అయ్యో, నా దేహస్థితికూడా

అందుకు సరిపోతున్నది."

"దురదృష్టవశాత్తూ నిజమై వుండదుకదా!"—అనుకుంటూ బయటికొచ్చింది తార.

"అంతలో—"నిన్నటి పాపపు చింత రాత్రి స్వప్న కారణమైంది. నిదుర పట్టక దేహమందు మందంగా వుంది. సుషుప్తావస్థయందు నే చేసిన ద్రోహము అపారమయినది. నా ఒడలు నిజమే అంటున్నది."

"కాని నమ్మలేకున్నాను. ఇంక మనస్సు నరికట్టి మెల గాలి."—అనుకుంటూ తారకు ఎదురయాడు చంద్రుడు.

"చంద్రా!"

"తల్లీ!"

"రాత్రి నా కొక దుస్వప్నము వచ్చింది."

"ఏమది!"

"ఏమి చెప్పేది తల్లీ!"

"చంద్రా!..."

"తల్లీ!..."

"అది నిజమై యుండవచ్చు. ఇంక సందియమేల? నిజమే! నా దేహస్థితి నాకు సాక్ష్యమిస్తున్నది. ఛీ! యింతటి హీనకాడ వవుతావని నే నెన్నడూ అనుకోలేదు. ఇంక నా ఎదుట పడవద్దు. వెళ్లిపో!"

◆ ◆ ◆

,,అయ్యో దైవమా! యింకేది గతి నాకీ యాగము పేరిట వారేల నన్ను విడిచి పోవలె? పోతే నాకీ కోర్కె ఎందుకు పుట్టాలె? పుత్రసాల్యుడు గదా అని యింట నుంచు కున్న చంద్రుడేల యీ మోసము తలపెట్టాలి? నే నేల సమ్మతించాలి? ఇక నా పతి ముఖ మెట్లా చూచేది? అగ్ని హోత్రములకు యిలవేల్పులకు పూజ ఎట్లా చేసేది? నేడు నాలో అన్యగోత్ర బీజ మున్నది కదా!''

మా వంశ మర్యాద నేడు మంట గలిసెగదా!

దేవగురువుగారి భార్య చంద్రుణ్ణి కుమారునికి మారుగా తనకుమారునిగా చూచుకొన్నదని నన్ను వేలెట్టి చూపుతుంది లోకం.

పతియు దుష్కృత్యము విని యింటినుండి వెడలగొడితే ఆదరించే దెవరు? మానభంగము ప్రాణభంగముకన్నా మిన్నగా చూచే సంఘము నన్ను మన్నిస్తుందా? దీనికి ఆత్మ హత్యే శరణ్యం. కాని నా పతి యిల్లు చేరినతరువాత క్షమా భిక్ష వేడి మరీ ప్రాణాలు విడుస్తాను. లేకుంటె నా ప్రాణి కెక్కడా సుఖముండదు''—అంటూ విచారించింది తార.

♦ ♦ ♦

,,మహా ఋషులలో అగ్రపూజార్హత గల్గిన అన సూయా సతికి తనయుడనై వర ప్రసాదినై పుట్టి, దేవగురువు లగు ప్రియశిష్యుడనయిన నేను మాతృతుల్య యగు గురు పత్నితో వ్యభిచరించేను. ఇక నీ జన్మ [illegible]? ఇంటటి

పాపం చేసిన ఈ దేహం కాల్చినా శుద్ధికాదుగదా! అనంగ రంగనికి యింతమాత్రం పాత్రాపాత్రత, వివక్షణ వలదా? నేను నా తల్లి మొఖ మెలా చూచేది? గురువుల నెట్లు ఎదురు కునేది? ఈ మందిరమందు నాకు తా వుందా? నా విద్య, నా మేధస్సు ఏ నీట గలిసేయి? ఇంతటి నిపలచిస్తున్నాయి తే నా బ్రతు కెందుకు? తల్లి అను మాటేనా తలపక యింతటి ఘోరానికి పూనుకున్నాను. ముల్లోకాలు పిడికిలి తిప్పగల మా ఒజ్జ యిది ఎరిగినపిదప నన్ను నిలవనిస్తాడా? క్షమించ వచ్చు నానీ లోకు లేమనుకుంటారు? 'గురుద్రోహి' 'మాతృ ద్రోహి' అంటారు. నా స్థితి అటుండ, తారాదేవికి 'మాయని మచ్చ' తెచ్చేను. పాపం కులసతి, ఉత్తమ ఇల్లాలు నేడు బహిష్కృత అయితే ఆమె పడే ఇక్కట్లు అన్నిటికీ నేనే కారణం. ఈ విచారంతో యిలా బ్రతికేకన్న గురువులు వచ్చినతరువాత వారి కెరిగించి, ప్రాణాలు విడుస్తే మేలని పిస్తున్నది." అంటూ విచారించాడు చంద్రుడు.

♦ ♦ ♦

యాగానంతరం మరలి వచ్చేడు బృహస్పతి. వస్తున్న వ్వాడే తన యింటివద్ద పరిస్థితులను యోగదృష్టితో పరికించి చూచేడు.

కారకుడయిన ఆ మదనుడ్ని కొంత అడిపోసేడు. కాని అపారమైన ప్రేమాభిమానము లున్నా తారంటే. ఆమెను బహిష్కృత చేసి, ప్రాయశ్చిత్తము చేస్తేనే కాని సంఘము వప్పదు. హింసింప ఎంతమాత్రము మనస్సొవ్వదు.

ఒక క్షణంలో తారా చంద్రులపై కోపము, మరి క్షణంలో జాలిగా మారుతూంది.

అల్లాంటి అవస్థలో చేరుకున్నారు యిల్లు.

జీవన్మృతుల్లా గున్నారు తారా చంద్రులు.

వాచస్పతి వచ్చినవెంటనే కాళ్లమీద యిద్దరూ ఒకేసారి పడ్డారు. జరిగినదంతా తారా చంద్రుడూకూడా చెప్పేశారు.

ముగ్గురూ కలిసి వలవల ఏడ్చారు.

,,తారా! నీవు గర్భము ధరించి వున్నావు. ఆ శ్రీహరి దోషము తీసివేయగలడు. వాని శరణు వేడుకో! భ్రూణహత్యామాత్రము వలదు. నీవు పునః ఋతువతివైన పిదప కలుసుకుంటాను. అంతదనుక నావద్ద నున్నా ఏలుకొనలేను'' అని అన్నాడు వాచస్పతి.

♦ ♦ ♦

ఉచిత వేళను తారా కొడుకును కన్నది. ఆ పై తారాయణుడయిన నారాయణుడు ఆమె దోషము తీసివేసాడు

నాటినుండి తారా బృహస్పతులు అన్యోన్య దాంపత్యం వెలయిస్తూ లోకపూజితులయినారు.

---

# విషయానుక్రమణిక

★


౧. ఆరవనాటి రాత్రి కస్తూరిలో —

౨. నపుంసకునివద్ద నాట్యవిద్యాభ్యాసం

౩. సీతారాములకు మళ్ళీ వనవాసము

౪. రాముడి రాజ్యం - భరతుడి పట్నం

౫. ముప్పు తెలియకకాదు, ముక్తోపగమే!

౬. 'తప్పునా? తాకనా? కుటుంబ సౌఖ్యాని ఏటులు..'

౭. 'నీవు సౌభాగ్యశాలి: ప్రేంగానిమార్చింకున్న'

౮. భ్రాతృహత్య చేసిన ధిక్కారపరుడు

౯. తార గదిలో చంద్రుడు


★